


నేడు పత్తి మార్కెట్‌కు సెలవు

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆదోని మార్కెట్ యార్డులో పత్తి మార్కెట్‌కు సెలవు అని యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. రెండు రోజులుగా భారీగా పత్తి దిగుబడులు విక్రయానికి రైతులు తీసుకొచ్చారు. సర్వర్ సమస్య వల్ల తూకాలు ఆలస్యమై దుకాణాల ముందే దిగుబడులను ఉంచేశారని తెలిపారు. కమీషన్ ఏజెంట్లు బుధవారం పత్తి మార్కెట్‌కు సెలవు ఇవ్వాలని కోరడంతో విక్రయానికి రైతులు తమ పత్తిని తీసుకురావద్దని కోరారు. వేరుశనగ, ఆముదాలు, పొద్దుతిరుగుడు ఇతర పంట ఉత్పత్తులకు కొనుగోలు జరుగుతాయన్నారు.

కేఎంసీలో ర్యాగింగ్ రక్కసి

- యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన నిల్
- కర్నూలు మెడికల్ కాలేజీలో కనిపించని పోస్టర్లు





కోటి ఆశలతో కర్నూలు వైద్య కళాశాలలో చేరిన వారికి ర్యాగింగ్ పేరిట భయంకర అనుభవం ఎదురవుతోంది. కొత్తగా కాలేజీలో చేరిన విద్యార్థులతో స్నేహాన్ని బలపరుచుకునే విధానాన్ని విస్మరించి, తోటి విద్యార్థి మానసికంగా కృంగిపోయేలా హింసకు ప్రేరేపిస్తున్నారు కొందరు సీనియర్లు. ఈ హింసకు 'ర్యాగింగ్' అనే పేరు పెట్టి మరీ తోటి విద్యార్థుల జీవితాలను చిదిమేసే ప్రక్రియకు శ్రీకారం చుడుతున్నారు. ఇది విద్యార్థుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసి, చదువులపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఇలాంటి విష సంస్కృతికి అడ్డుకట్ట పడాలి. ర్యాగింగ్ కారణంగా విద్యార్థుల్లో ఆందోళన, భయం, నిరాశ పెరుగుతున్నాయి. దీంతో వారి మానసిక ఆరోగ్యం కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది. లక్ష్యంపై దృష్టి సారించలేక, చదువులపై ఏకాగ్రత కోల్పోయి పరీక్షల్లో వెనుకంజ వేస్తున్నారు. పటిష్టమైన నియంత్రణ చర్యలపై కళాశాలలు సరైన మొగ్గుచూపక పోవడంతో ర్యాగింగ్ రక్కసి విరుచుకుపడుతోంది. తాజాగా కర్నూలు మెడికల్ కళాశాలలో జరుగుతున్న ర్యాగింగ్ సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

వివరాలు 6లో

న్యూస్ బాక్స్

ఈనామ్ సర్వర్ మొరాయింపు

పంట ఉత్పత్తులు విక్రయానికి తేవద్దు: సెక్రటరీ విజ్ఞప్తి

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్‌యార్డులో రెండు రోజులుగా ఈనామ్ సర్వర్ మొరాయిస్తుందని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి మంగళవారం తెలిపారు. ఎక్కువ మొత్తంలో ఉల్లిగడ్డలు రైతులు తీసుకు వస్తున్నందున వారి అవసరాలను పరిగణనలోకి తీసుకుని మాన్యువల్ పద్ధతిలో వేలం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈనామ్ సర్వర్ సక్రమంగా పని చేసేంత వరకు మరో రెండు రోజులు వేరుశనగ, సజ్జలు, కొర్రలు, మొక్క జొన్న, ఆముదం తదితర పంట ఉత్పత్తులను విక్రయానికి తీసుకురావద్దని ఆమె రైతులకు విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి బీఈడీ మొదటి సెమిస్టర్

కర్నూలు అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23 నుంచి 29 వరకు బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిలా లోని 17 పరీక్షా కేంద్రాల్లో రెగ్యులర్ 3,688, సప్లి మెంటరీ 1,513 మంది విద్యార్థులు హాజరయి పరీక్షలు రాస్తారని తెలిపారు. పరీక్షల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్ వెబ్ సైట్‌లో హాలు టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని ఆ యా కళాశాల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని తెలిపారు.

వసతి గృహాల తనిఖీ



హాస్టల్‌లో మాట్లాడుతున్న వెంకటశేషాద్రి

కర్నూలు లీగల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ హాస్టళ్లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి మంగళవారం తనిఖీ చేశారు. జిల్లా బీసీ సంక్షేమ, సాధికారిత ఇన్‌చార్జి అధికారి వెంకటలక్ష్మమ్మతో పాటు ఆయన స్థానిక జేసీ బంగ్లా సమీపంలోని వసతి గృహాన్ని, డాక్టర్స్ కాలనీ, ఎఫ్‌ఏ కాలనీలలోని వసతి గృహాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఆహార నాణ్యత, రికార్డులను తనిఖీ చేశారు. వసతి గృహాల్లో ఉన్న సౌకర్యాలు, ఆహార నాణ్యత, అక్కడి పరిశుభ్రతను పరిశీలించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

రైతును దగా చేస్తున్న సీసీఐ



పెంచికలపాడులోని పత్తి జిన్నింగ్ మిల్లు

- రైతులకు దళారులే దిక్కు
- మార్కెట్ యార్డుల్లో కేంద్రాలు పెడితేనే రైతుకు న్యాయం
- జిన్నింగ్ మిల్లులోనే కేంద్రాల ఏర్పాటుతో దళారుల హవా
- 90 శాతం గ్రామాల్లోనే విక్రయాలు
- విచ్చలవిడిగా కల్తీ, నాసిరకం విత్తనాలు

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి రైతులను దళారుల నుంచి కాపాడి ఆదుకోవాలి. కానీ ఆచరణలో సీసీఐ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. దీని వల్ల పత్తి రైతులను దళారులు దగా చేస్తున్నారు. అక్టోబరు నుంచి సీసీఐ సంస్థ రైతుల నుంచి పత్తి కొనడానికి సమాయత్తం అవుతోంది. సీసీఐ కేంద్రాల పాత్ర నామమాత్రంగా మారడంతో దాదాపు 90 శాతం పత్తిని గ్రామాల్లో దళారులే కొంటున్నారు. వాళ్లు చెప్పిన ధరకే రైతులు అమ్మాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలోనే పత్తి సాగులో మొదటి స్థానంలో ఉన్న ఉమ్మడి కర్నూలు జిల్లా ఉంది. కర్నూలు జిల్లాలో దాదాపు సాధారణ సాగు 4 లక్షల హెక్టార్లు కాగా, అందులో సగం 1.90 లక్షల హెక్టార్లలో పత్తి సాగవుతున్నది. నంద్యాల జిల్లాలో కూడా దాదాపు 20వేల హెక్టార్ల విస్తీర్ణంలో పత్తి సాగు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 2 లక్షల మంది రైతులు ఈ పత్తి సాగుపైనే ఆధారపడి ఉన్నారు.

మిగతా 7లో..

నేడు ఏపీఆర్‌ఆర్‌పీ పనులపై సమీక్ష

- వైసీపీ పాలనలో రూ.189.11 కోట్లతో చేపట్టి పనులు
- ఆరు ప్యాకేజీల్లో 42 పనులు పూర్తి, పురోగతిలో 23

కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్స్ ప్రాజెక్టు(ఏపీఆర్‌ఆర్‌పీ) కింద చేపట్టిన పనులపై ప్రభుత్వం బుధవారం విజయవాడలో సమీక్షా సమావేశం నిర్వహించనుంది. ఇప్పటి వరకు పనులు ఎంత వరకు పూర్తి అయ్యాయో వాటిపై ఆరా తీయనుంది. 2019 తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ఈ పనులకు టెండర్లు పిలిచారు. అంతలోనే ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. అప్పట్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో టెండర్ల దశలో ఆగిపోయిన ఈ పనులను ప్రారంభించింది. ఈ క్రమంలోనే జిల్లాలో 41,42,43,44ఏ,44బి,44సి ప్యాకేజీల కింద రూ.189.11 కోట్లతో 85 పనులను(86.10 కి.మీ. రోడ్లు, బ్రిడ్జీలు) చేపట్టారు. ఇందులో ఇప్పటి వరకు 42 పనులు పూర్తి అయ్యాయి. 23 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మిగితా పనుల ఊసే లేదు. చేపట్టిన పనులకు సంబంధించి మొత్తం రూ.82 కోట్లు వెచ్చించగా గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కేవలం రూ.49 కోట్లు మాత్రమే చెల్లించింది.

హాజరుకానున్న పీఆర్ అధికారులు

జిల్లాలో ఐదేళ్ల కాలంలో ఏపీఆర్‌ఆర్‌పీ కింద చేపట్టిన పనులపై విజయవాడలో జరిగే పీడీ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించనున్నారు. జిల్లా నుంచి పీఆర్ ఎస్ఈ, ఈఈ, డీఈఈలు హాజరుకానున్నారు. ఈ సమీక్షలో ప్రధానంగా ఈ పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను సీఎఫ్ఎంఎస్, నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేందుకు జరుగుతున్న జాప్యం, అప్రూవ్ అయిన పనులపై సమీక్ష నిర్వహించనున్నారు. అలాగే గడిచిన ఆరు నెలలుగా ఎలాంటి పురోగతి చూపించని పనులు, నెలవారీ ప్రగతి నివేదికల గురించి సమీక్షా సమావేశంలో చర్చించనున్నారు. ఈ ఏడాది డిసెంబరు 31 నాటికి ఎన్ని పనులు పూర్తి చేస్తారు? ల్యాప్స్ అయిన ఈఓఏటీలపై వివరాలను సంబంధిత ఇంజనీర్ల నుంచి కోరనున్నారు. ఇరిగేషన్, ఫారెస్టు డిపార్టుమెంటు నుంచి క్లియరెన్సు రావాల్సిన విషయాలపై సమీక్షించనున్నారు.

ఎస్పీవై ఆగ్రోస్‌లో సీఐడీ తనిఖీలు

నంద్యాల క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణ శివారులోని ఆటో నగర్‌లో ఉన్న ఎస్పీవై ఆగ్రోస్ కంపెనీలో మంగళవారం ఏపీ సీఐడీ అధికారుల బృందం తనిఖీలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా మద్యం డిస్టిలరీ కంపెనీల్లో సీఐడీ అధికారుల తనిఖీల్లో భాగంగా నంద్యాలలోని ఎస్పీవై ఆగ్రోలో అడిషనల్ ఎస్పీ హుసేన్‌పీరా నేతృత్వంలో బృందం విస్తృత తనిఖీలు చేపట్టింది. గత అయిదేళ్ల వైసీపీ పాలనలో కంపెనీలో జరిగిన మద్యం తయారీ, లావాదేవీలు, కంపెనీ నిర్వహణ దస్త్రాలను మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో సీఐడీ సీఐ గిరిబాబు, సీఐడీ సిబ్బంది, నంద్యాల ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి, సిబ్బంది, నంద్యాల తాలుకా అర్బన్ ఎస్సై గంగయ్య యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.



నంద్యాలలోని ఎస్పీవై ఆగ్రోస్‌లో సీఐడీ అధికారుల బృందం

కొత్త చట్టంతో కౌలు రైతులకు భద్రత

- వచ్చే నెల 5 వరకు అవగాహన
- జాయింట్ కలెక్టర్ నవ్య
- రైతుల అభిప్రాయాల సేకరణ

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కౌలు రైతులకు భద్రత, ప్రభుత్వ పథకాల ప్రయోజనం కల్పించేందుకు ప్రభుత్వం కౌలుదారుల చట్టం-2024 అమలులోకి తెచ్చేందుకు నిర్ణయించిందని జాయింట్ కలెక్టర్ బి. నవ్య తెలిపారు. మంగళవారం కర్నూలు నగరంలోని ఉద్యానవన శాఖ కాన్ఫరెన్స్ హాల్లో వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి ఆధ్వర్యంలో కౌలుదారుల కొత్త చట్టంపై కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాల నుంచి వచ్చిన రైతులకు అవగాహన కల్పించి అభిప్రాయాలను తీసుకున్నారు. ముఖ్య అతిథులుగా జేసీ నవ్య, వ్యవసాయ శాఖ కమిషనరేట్ నుంచి జేడీ స్థాయి అధికారి శ్రీధర్, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ఎప్పటి నుంచో చట్టాలను తీసుకువచ్చి అమలు చేస్తున్నా తగిన ప్రాధాన్యతా ప్రయోజనాలు అందడం లేదన్నారు. కేవలం కంటి తుడుపుగానే ఈ చట్టాలు అమలవుతున్నాయని, దీని వల్ల ప్రయోజనం పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక సంవత్సరం పాటు కాకుండా మూడు సంవత్సరాలకు ఒకసారి కౌలుదారులకు సీసీఆర్‌సీ కార్డులు అందించారని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జేసీ నవ్య మాట్లాడుతూ గతంలో కౌలు రైతులకు హక్కుపత్రాలను అందించడంలో రెవెన్యూ శాఖ అధికారులు కీలకంగా వ్యవహరించేవారని, కొత్త చట్టం ప్రకారం వ్యవసాయ శాఖ అధికారులే హక్కుపత్రాల మంజూరులో ప్రధానపాత్ర పోషిస్తారని స్పష్టం చేశారు. వచ్చే నెల 5వరకు ప్రతి జిల్లాలో కౌలుదారుల కోసం ప్రభుత్వం అమలు చేయనున్న కొత్త చట్టంపై అవగాహన కల్పిస్తామని, రైతుల నుంచి అభిప్రాయాలు తీసుకుని గ్రామసభల్లో తీర్మానాలు చేసి ఆ సభల్లో రైతులు సూచించిన అంశాల ప్రకారం కొత్త చట్టంలో మార్పులు, చేర్పులు చేయనున్నట్లు తెలిపారు. పంట సాగు కాల పరిమితిని బట్టి కౌలు రైతులకు హక్కు పత్రాలు అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అనంతపురం, నంద్యాల జేడీలు ఉమామహేశ్వరమ్మ, మురళీకృష్ణ, డిప్యూటీ డైరెక్టర్లు, ఏడీఏలు, శాస్త్రవేత్తలు, ఆయా జిల్లాల రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ బి. నవ్య

వలస పోతున్నారు..!



కోసిగి నుంచి ట్రాక్టర్లలో వలస వెళ్లేందుకు సిద్ధం చేసుకున్న మూటలు

కోసిగి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు పశ్చిమ ప్రాంతం నుంచి వలసలు రోజురోజుకూ అధికమవుతున్నాయి. తాజాగా మంగళవారం కోసిగి నుంచి దాదాపు 600 కుటుంబాలు నుంచి 2 వేల మందికి పైగా కూలీలు ప్రత్యేక వాహనాల్లో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు బయల్దేరారు. వచ్చే ఏడాది జనవరిలో జరిగే శ్రీమారెమ్మ దేవి దేవరకు మూడు నెలల తర్వాత తిరిగి వస్తామని బంధువులకు కన్నీటి వీడ్కోలు చెప్పి.. పిల్లాపాపలతో కలిసి సుగ్గికి పయనమయ్యారు. వలస ప్రాంతాల్లో పత్తి విడిపించేందుకు వెళ్లే పనుల్లో రూ.800 నుంచి రూ.1000 వరకు రోజుకు కూలి వస్తోంది. దీంతో కూలీలు, రైతులు లారీలు, బొలేరో వాహనాలతో పాటు రైళ్లలో పనుల కోసం వెళ్తున్నారు. ఇదిలా ఉండగా వలస ప్రభావంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు హాజరు శాతం తగ్గిపోతోంది.



బొలేరో వాహనంలో తెలంగాణకు వెళ్తున్న కూలీలు

ఎమ్మిగనూరులో వైసీపీకి షాక్

- ఎమ్మెల్యే బీవీ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు 7

తుంగభద్రకు భారీ వరద

- 25 గేట్ల ద్వారా 1,12,136 క్యూసెక్కుల నీటి విడుదల 6



పోస్టింగ్ కోసం ఎదురుచూపులు

- కేజీబీవీలో ఉద్యోగుల సర్దుబాటుపై కాంట్రాక్ట్ టీచర్ల గగ్గోలు 7

ఆదర్శం









చిరుధాన్యాలతో ఆహార పదార్థాలు

మోదీ మెచ్చిన రైతు



- చిరుధాన్యాల సాగులో నంద్యాల వాసి
- రైతులకు స్ఫూర్తిగా నిలుస్తున్న రామసుబ్బారెడ్డి

మధ్యాహ్న భోజన పథకంలో చేర్చాలి

చిరుధాన్యాలను సాగు చేసేలా రైతులు, వాటిని ఆహారంగా తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి. అదే సమయంలో రైతులు పండించిన పంటను ప్రాసెస్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. గోధుమ, వరి, ఇతర పంటలకు ఇచ్చిన ప్రాధాన్యాన్ని చిరుధాన్యాలకు కూడా ఇవ్వాలి. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా చిరుధాన్యాలను చేర్చాయి. అన్ని రాష్ట్రాల్లో ఈ విధానం అమలు అయ్యేలా చూడాలి.

- రామసుబ్బారెడ్డి, రైతు

నంద్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నంద్యాలకు సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న మద్దూరు గ్రామం అది. ఆ గ్రామం శివారులోని ఓ సువిశాల వ్యవసాయ క్షేత్రంలో సాగవుతున్న చిరుధాన్యాల పంటల మధ్య ఓ 50 ఏళ్ల వ్యక్తి కలియ తిరుగుతూ అన్నింటినీ జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు. అక్కడే ఉన్న చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్‌కు వచ్చి పలు సూచనలిస్తున్నారు. ఆ తరువాత ఆ ప్రాసెసింగ్ యూనిట్ పక్కనే ఉన్న బేకరీలోకి వెళ్లి చిరుధాన్యాలతో బిస్కెట్లు, లడ్డూల తయారీలో నిమగ్నమయ్యారు. ఆయనే ప్రధాని మెచ్చిన రైతు రామసుబ్బారెడ్డి. అందరూ నడిచే దారిలో కాకుండా పురుగు మందుల అవశేషాలు లేని, ఆరోగ్యానికి మేలు చేసే చిరుధాన్యాలు పండించాలని రామసుబ్బారెడ్డి భావించాడు. ఆ మేరకు పంటలు సాగు చేయడమే కాకుండా వాటి గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ముందుకు సాగారు. ఆయన కృషి ప్రధాని నరేంద్ర మోదీ వరకు వెళ్లింది. దీంతో మోదీ తన మన్ కీ బాత్ కార్యక్రమంలో గత ఏడాది రామసుబ్బారెడ్డిని ప్రత్యేకంగా ప్రశంసించారు.



మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ సిబ్బందితో రామసుబ్బారెడ్డి

బనగానపల్లె మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన కేవీ రామసుబ్బారెడ్డిది వ్యవసాయ కుటుంబం. అప్పటి మద్రాసులో ఐసీడబ్ల్యూ పూర్తి చేశాక ఢిల్లీలో మంచి ఉద్యోగం రావటంతో వ్యవసాయంతో ఆయనకు ఉన్న అనుబంధం తెగిపోయింది. అయితే రూ.5 లక్షల జీతం వచ్చే ఉద్యోగం చేస్తున్నా మనస్సు మాత్రం వ్యవసాయం మీదకే లాగేది. దీంతో చేస్తున్న ఉద్యోగానికి 2018లో రాజీనామా చేసి వ్యవసాయం చేసేందుకు ఢిల్లీ వదిలి నంద్యాలకు వచ్చేశారు. ఉద్యోగం చేస్తున్న సమయంలో కూడబెట్టిన డబ్బుతో నంద్యాలకు దగ్గరలోని మద్దూరు గ్రామంలో 20 ఎకరాలు కొనుగోలు చేశారు. నంద్యాలకు వచ్చీ రాగానే ఈ వ్యవసాయ క్షేత్రాన్ని తన ఆలోచనలకు అనుగుణంగా తీర్చిదిద్దారు. పండ్ల సాగు సరైనదని భావించి సేంద్రియ వ్యవసాయ విధానంలో తోటలను వేశారు. రూ.30 లక్షల నష్టం రావడంతో మళ్లీ ఉద్యోగం వైపు వెళ్లాలా అనే సందిగ్ధంలో పడ్డాడు. అదే సమయంలో చిరుధాన్యాల ఆవశ్యకతను కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. పోషకాహార లోపాన్ని తరిమికొట్టడానికి చిరుధాన్యాల విప్లవం రావాలంటూ మోదీ పిలుపునిచ్చారు. అంతేగాకుండా వీటి సాగును ప్రోత్సహించేందుకు 2018ని చిరుధాన్యాల సంవత్సరంగా జరిపారు. దీంతో ఆయన వ్యవసాయ క్షేత్రంలోని పండ్ల తోటలను తీసేసి చిరుధాన్యాల సాగు వైపు దృష్టి సారించారు. రాయలసీమ ప్రాంతంలో ప్రస్తుతం పండించే జొన్నలు, రాగులకు తోడు కొర్రలు, అండుకొర్రలు, సామలు, ఊదలు, అరికెల వంటివి పండించటం మొదలుపెట్టడమే కాకుండా వీటిని ప్రాసెస్ చేసే యూనిట్‌ను కూడా నెలకొల్పారు. సుబ్బారెడ్డి వ్యవసాయం అన్నప్పుడు నిరుత్సాహపరిచిన కుటుంబ సభ్యులే ఆ తర్వాత ఆయన వెంట నడవటం ప్రారంభించారు. వ్యవసాయం, ప్రాసెసింగ్ యూనిట్, చిరుధాన్యాలతో తయారు చేస్తున్న బిస్కెట్లు, కుకీస్, లడ్డూలను మార్కెట్ చేయటంలో సుబ్బారెడ్డి భార్య, పిల్లలతో పాటు ఆయన తమ్ముళ్లిద్దరి కుటుంబ సభ్యులు భాగమయ్యారు. సుబ్బారెడ్డి వ్యవసాయ విధానం మరికొంత మంది రైతులను చిరుధాన్యాల సాగు బాటలో నడిచేలా చేసింది.

రామసుబ్బారెడ్డి స్ఫూర్తితో..

సుబ్బారెడ్డి ఏర్పాటు చేసిన క్షేత్రంలో వివిధ రకాల చిరుధాన్యాలను పండిస్తున్నారు. వీటిని ప్రాసెస్ చేసి ఇడ్లీ రవ్వ, ఉప్మా రవ్వ రూపంలో అందిస్తున్నారు. ఇలా తినలేని వారి కోసం బిస్కెట్లు, కుకీలు, లడ్డూల రూపంలో అందిస్తున్నారు. ఆ ఆలోచనను ఆచరణలో పెడుతూనే మరో వైపు వ్యవసాయ శాస్త్రవేత్తల సాయంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ చిరుధాన్యాలపై రైతులు, ప్రజలకు ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. అంతేగాకుండా రైతులు పండించిన పంటను తానే తీసుకుంటానని భరోసా కల్పించడంతో చాలా మంది రైతులు చిరుధాన్యాల సాగుకు ముందుకు వస్తున్నారు. 2020లో రెండు తెలుగు రాష్ట్రాల్లో చిరుధాన్యాలను పండించే రైతుల సంఖ్య 400 మంది ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 700కు చేరుకుంది. చిరుధాన్యాల ప్రాముఖ్యాన్ని పెంచేందుకు కొంత కాలం నుంచి ప్రపంచ వ్యాప్తంగా కృషి జరుగుతోంది. ఇక కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనతో ఐక్యరాజ్య సమితి 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా జరిపింది.



ప్రాసెసింగ్ యూనిట్



సజ్జపంటలో...




పైప్ లైన్ పగిలి..



కోసిగి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండల పరిధిలోని సాతనూరు గ్రామ సమీపంలో పులికనుమ పంప్‌హౌస్ పైపులైన్ పగలిపోయి నీరు ఉవ్వెతున ఎగిసిపడింది. సుమారు 40 ఎకరాల మేర పత్తి, మిరప పంటలు నీట మునిగాయి. తుంగభద్ర నది సమీపంలో ఉన్న సాతనూరు గ్రామ సమీపంలోని పొలాల్లో పైపులైన్ పగిలి సుమారు పది అడుగుల మేర నీళ్లు పైకి ఉవెత్తున ఎగిసి పొలాల్లో భారీగా నీరు చేరాయి.

తుంగభద్రకు భారీ వరద



హాలహర్వి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర నదికి మళ్లీ భారీ వరద వచ్చి చేరుతోంది. దీంతో టీబీ బోర్డు అధికారులు నదీతీర గ్రామాలను అప్రమత్తంగా ఉండాలని బళ్లారి, కర్నూలు కలెక్టర్లకు సమాచారం ఇచ్చారు. జలాశయానికి వరద పెరుగుతుండటంతో మంగళవారం బోర్డు ఇన్‌చార్జి ఎస్ఈ నీలకంఠ రెడ్డి, సెక్రెటరీ రామకృష్ణారెడ్డి, దాదాపు 25 గేట్లు ఎత్తి నదికి 1,12,136 క్యూసెక్కుల నీటికి విడుదల చేశారు. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 105.788 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 101.461 టీఎంసీలుగా కొనసాగుతోంది. ఇన్‌ఫ్లో 1,12,136 క్యూసెక్కులు ఉండగా అవుట్‌ఫ్లో కూడా అంతేస్థాయిలో నదికి వదిలేస్తున్నారు.

తుంగభద్రమ్మకు సూర్య సింధూరం





తుంగభద్ర జలాశయం నిండు కుండలా కనిపిస్తోంది. డ్యాంలోకి భారీ వేగంతో వరద పోటెత్తుతున్నా పైకి మాత్రం చాలా ప్రశాంతంగా ఉంది. మంగళవారం సాయంత్రం సూర్యాస్తమయాన హోస్పేట్‌లోని తుంగభద్రమ్మ ఇలా కనువిందు చేసింది.
- కర్నూలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):

మున్సిపల్ కమిషనర్ ఆదేశాల కొట్టివేత

కర్నూలు లీగల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని కల్లూరు మండలంలో నిర్మిస్తున్న కట్టడాలను నిలిపివేసి, తొలగించాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను రాష్ట్ర హైకోర్టు కొట్టివేసింది. కల్లూరు మండలంలోని 524 సర్వే నెంబరులో పిటీషనర్లు దాసరి నాగ ప్రకాష్, మరో ఇద్దరు భవనాలను నిర్మిస్తున్నారు. ఈ కట్టడాలు అక్రమ కట్టడాలు అని, వీటిని వెంటనే నిలిపివేసి తొలగించాలంటూ నగర మున్సిపల్ కమిషనర్ 2023, 2024లో పిటీషనర్లకు నోటీసులు జారీ చేశారు. ఈ కట్టడాలను మూడు రోజుల్లోపల తొలగించాలని కమిషనర్ తన ఆదేశాలలో పేర్కొన్నారు. దీంతో పిటీషనర్లు హైకోర్టును ఆశ్రయించి తమ వాదనలు వినిపించుకోవడానికి తగిన అవకాశం ఇవ్వలేదని రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు పిటీషనర్లకు రెండు వారాల పాటు అవకాశం ఇచ్చి ఆ తర్వాత నియమ నిబంధనల మేరకు వారి అభ్యంతరాలను పరిశీలించాలని కమిషనర్‌ను ఆదేశిస్తూ కమిషనర్ ఇచ్చిన నోటీసులను కొట్టివేసింది.

కేఎంసీలో ర్యాగింగ్ రక్కసి

- యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన నిల్
- కర్నూలు మెడికల్ కాలేజీలో కనిపించని పోస్టర్లు
- ఆందోళనలో జూనియర్ విద్యార్థులు
- చర్చనీయాంశంగా మారిన తాజా ఘటనలు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీలో గత ఏడాది మాదిరిగానే ర్యాగింగ్ రక్కసి మళ్లీ జడలు విప్పింది. కాలేజీ ఆవరణలోనే జూనియర్ విద్యార్థులను సీనియర్ విద్యార్థులు వేధిస్తూ ర్యాగింగ్‌కు పాల్పడుతున్నారు. ఈనెల 14వ తేదీన ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. తరగతులు ముగిసిన తర్వాత సీనియర్లు, జూనియర్లను వేధించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ర్యాగింగ్‌పై అవగాహన, అరికట్టాల్సిన కర్నూలు మెడికల్ కాలేజీ అధికారులు మీనమేషాలు వేస్తున్నారు. ఫ్రెషర్స్ చేరి 9 రోజులవుతున్న కాలేజీ ఆవరణంలో కానీ, హాస్టల్స్‌లో గానీ ఎక్కడా యాంటీ ర్యాగింగ్ పోస్టర్స్ వాటి శిక్షలు ఎక్కడా కనిపించడం లేదు. నిబంధనల ప్రకారం ర్యాగింగ్ పోస్టర్స్, ఫ్లెక్సీలు సీనియర్లలో భయాన్ని కొత్త విద్యార్థుల్లో ధైర్యాన్ని నింపడానికి ఎంతో దోహదపడుతాయి. కాలేజీలో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ సీట్లు అడ్మిషన్ల సమయంలోనే యాంటి ర్యాగింగ్ పోస్టర్లను అతికించాలి. నెల రోజులవుతున్నా పోస్టర్లు అడ్రస్ ఎక్కడా కనిపించడం లేదు. దీంతో కాలేజీ ఆవరణంలో ర్యాగింగ్ ఘటనలు జరుగుతూనే ఉన్నాయి.



తెరుచుకోని ర్యాగింగ్ ఫిర్యాదుల బాక్స్

కర్నూలు మెడికల్ కాలేజీ, హాస్టల్‌లో కొత్త విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ర్యాగింగ్ ఫిర్యాదుల బాక్సులు ఇంత వరకు ఓపెన్ కాలేదు. కాలేజీ ఆవరణలోని అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, మెన్స్ హాస్టల్, ఉమెన్స్ హాస్టల్‌లో ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదుల బాక్స్‌లను ఏర్పాటు చేశారు. కొత్త విద్యార్థులు వచ్చి 9 రోజులు అవుతున్నా ఇంత వరకు బాక్సులను తెరవకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ర్యాగింగ్‌తో విచారణ కమిటీ



కర్నూలు మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ ఘటనపై పత్రికల్లో వచ్చిన కథనాలపై ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ ఆరుగురు సభ్యులతో విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ చాంబర్‌లో ఆమె మాట్లాడుతూ కమిటీలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సాయిసుధీర్, కన్వీనర్‌గా ఉంటారు. సభ్యులుగా వైస్ ప్రిన్సిపాల్ పి. హరిచరణ్, సైక్రియాట్రి ప్రొఫెసర్ మెన్స్ హాస్టల్ వార్డెన్ ఎన్.నాగేశ్వరరావు, మాధవీశ్యామల, సర్జరీ ప్రొఫెసర్, ఉమెన్స్ హాస్టల్ వార్డెన్ అప్తామాలజి ప్రొఫెసర్ యుగంధర్ రెడ్డి, మెడిసిన్ హెచ్‌వోడీ ఇక్బాల్ హుసేన్ కొనసాగుతారు. విచారణ రెండు రోజుల్లో జరిపి నివేదికను ప్రిన్సిపాల్‌కు అందజేయాల్సి ఉంటుంది. ఈ నెల 21న రాత్రి వైస్ ప్రిన్సిపాల్ విజయానందబాబు, వార్డెన్ నాగేశ్వరరావుతో కలిసి మెన్స్ హాస్టల్‌లో తనిఖీలు చేసినట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. కొటేషన్ ప్రాతిపదికన ఫ్యాకల్టీ డాక్టర్ల బృందాన్ని ఏర్పాటు చేసి హాస్టల్స్‌లో ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు రోస్టర్‌గా ఉన్న డాక్టర్ పర్యవేక్షిస్తారన్నారు. ర్యాగింగ్ ఘటనపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ప్రిన్సిపాల్ తెలిపారు



కాలేజీలో ఉన్న ఫిర్యాదుల బాక్స్

పర్యవేక్షణ ఏదీ..?

తొమ్మిది రోజుల క్రితం కొత్త విద్యార్థులకు ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభమయ్యాయి. 240 మంది వైద్యవిద్యార్థులు కొత్తగా చేరారు. ఇందులో రాజ్‌విహార్ మెన్స్ హాస్టల్‌లో 98 మంది, ఉమెన్స్ హాస్టల్‌లో 95 మంది జాయిన్ అయ్యారు. కాలేజీకి నలుగురు వైస్ ప్రిన్సిపాళ్లు, మెన్, ఉమెన్స్ హాస్టళ్లలో చీఫ్ వార్డెన్, డిప్యూటీ వార్డెన్, అసిస్టెంట్ వార్డెన్లు పని చేస్తున్నారు. ప్రతి రోజు కాలేజీ తరగతులు ప్రారంభం, ముగిసే సమయంలో అధికారులు మానిటరింగ్ చేయాలి. అయితే ఏదీ ఎక్కడా జరగడం లేదు. సీనియర్ ప్రొఫెసర్లు తరగతులకు వెళ్లి యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన, చట్టప్రకారం శిక్షల గురించి వివరించాలి. ఇది కూడా జరగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ర్యాగింగ్ ఘటనలు జరుగుతున్నాయి. మెన్స్ హాస్టల్‌లో కూడా కొందరు సీనియర్లు తమకు భోజనం తీసుకురావాలని, ప్లేట్లు శుభ్రం చేయాలని హుకుం జారీ చేస్తున్నట్లు తెలిసింది. హాస్టల్‌లో ప్రతి రోజు రాత్రి సీనియర్లు వీడియోగేమ్స్ ఆడించి స్కోర్‌ను తెలపాలని జూనియర్లను వేధిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా కాలేజీ, హాస్టల్ అధికారులు ఏ మాత్రం స్పందించడం లేదు. కొత్తగా చేరిన రోజుల్లో ఓ డాక్టర్ హాస్టల్‌లో ఉండి పరిస్థితిని పర్యవేక్షించాలి. కానీ అది కనిపించడం లేదు. హాస్టల్ వార్డెన్, డిప్యూటీ, అసిస్టెంట్ వార్డెన్లు ర్యాగింగ్ వేధింపులు జరగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సీబీసీఐడీ విచారణకు ఆదేశం..!

- ఆర్‌వోఆర్ కేసు విచారణలో అధికార దుర్వినియోగం ● హైకోర్టును ఆశ్రయించిన బాధితులు ● మూడు వారాల్లో నివేదిక ఇవ్వాలని సీబీసీఐడీని ఆదేశించిన హైకోర్టు



నంద్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలంలోని గత రెవెన్యూ అధికారుల, సిబ్బంది పనితీరుపై సీబీసీఐడీ విచారణ చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఉయ్యాలవాడ మండలం రూపనగుడి గ్రామానికి చెందిన సర్వే నంబర్ 412, 412-2లోని భూమికి సంబంధించిన ఆర్‌వోఆర్ కేసు విచారణలో అప్పటి తహసీల్దార్ డి రవి కుమార్ నిర్వహించిన విచారణలో లోపాలున్నాయని రూపనగుడికి చెందిన చిన్ననరసన్నగారి రుద్రయ్య, సుశీల దంపతులు హైకోర్టును ఆశ్రయించారు. రాష్ట్ర రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రటరీ నుంచి కలెక్టర్, డీఆర్‌వో, ఆర్డీవో, తహసీల్దార్, సర్వేయర్, ఆర్ఐ, వీఆర్వో తదితరులను ప్రతివాదులుగా చేర్చుతూ హైకోర్టులో వారు రిట్ పిటీషన్ దాఖలు చేశారు. ఉయ్యాలవాడ మండలం రూపనగుడి గ్రామానికి చెందిన ఎగ్గోని తిమ్మారెడ్డి సర్వే నంబర్ 412లో తనకు చెందిన 2.24 ఎకరాల భూమికి గాను 1.12 ఎకరాల భూమి మాత్రమే నమోదైందని, మిగిలిన భూమి తన పేరిట ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని 2023 అక్టోబరులో సంబంధిత తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ సమస్య విచారణలో భాగంగా ఆ సర్వే నంబరులోని రైతులందరికీ అప్పటి తహసీల్దార్ రవి కుమార్ నోటీసులు జారీ చేశారు. నోటీసుల అందుకున్న రైతులు 2023 అక్టోబరు 17న విచారణకు హాజరయ్యారు. ఇందులో భాగంగా రైతుల స్టేట్‌మెంట్లను గ్రామ వీఆర్వో వెంకటలక్ష్మమ్మ రికార్డు చేశారు. ఇందులో భాగంగా రైతుల్లో ఒకరైన వెంకటేశ్వరరెడ్డి పేరిట స్టేట్‌మెంటు ఇచ్చినట్లు నమోదు చేశారు. వాస్తవానికి తోట వెంకటేశ్వరరెడ్డి 2014లోనే చనిపోయినట్లు రికార్డుల్లో ఉంది. అయితే ఇవేవీ పట్టించుకోని రెవెన్యూ అధికారులు వెంకటేశ్వరరెడ్డి పేరుతో స్టేట్‌మెంటును నమోదు చేసి, ఆయన బంధువుతో సంతకం చేయించారు. రెవెన్యూ అధికారులు అంతటితో ఆగకుండా సుశీల పేరుమీద ఉన్న 1.12 ఎకరాల భూమిని రైతు తిమ్మారెడ్డి పేరు మీద ఆన్‌లైన్ చేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో తమకు అన్యాయం జరుగుతుందని భావించిన రుద్రయ్య, సుశీల హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేశారు. ఆర్‌వోఆర్ కేసు విచారణలో భాగంగా చనిపోయిన వ్యక్తి పేరు మీద రెవెన్యూ అధికారులు స్టేట్‌మెంట్ నమోదు చేసినట్లు వారు హైకోర్టుకు నివేదించారు. అప్పటి తహసీల్దార్ రవి కుమార్, రెవెన్యూ సిబ్బంది ప్రాథమికంగా అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు హైకోర్టు విచారణలో వెల్లడవ్వడంతో ఈ ఘటనపై సమగ్రంగా విచారణ నిర్వహించాలని రాష్ట్ర హైకోర్టు సీబీసీఐడీని ఆదేశించింది. ఇందుకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకుని సమగ్ర విచారణ నిర్వహించి మూడు వారాలలోపు సీల్డు కవరులో కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది.

రైతును దగా చేస్తున్న సీసీఐ



5వ పేజీ తరువాయి

అక్టోబరు మొదటి వారం నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాలో పత్తి కొనుగోలుకు ఆ సంస్థ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పత్తి సాగయ్యే ప్రతి నియోజకవర్గంలో ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా.. కేవలం ఆదోని, పెంచికలపాడు, కోడుమూరు, నంద్యాలలో మాత్రమే పత్తి కొనడానికి జిన్నింగ్ మిల్లులో కొనుగోలు కేంద్రాలను మార్కెటింగ్ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలుతో పాటు నందికొ ట్కూరు, ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ, నంద్యాల జిల్లాలో ఎక్కువగా పత్తిని సాగు చేస్తున్నారు. అయితే కేవలం నాలుగు చోట్ల మాత్రమే ఏటా సీసీఐ సంస్థ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుండటంతో దూర ప్రాంతాల్లోని రైతులు ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లాల్సి వస్తున్నది. ప్రతి నియోజకవర్గంలోనూ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని పత్తి రైతులు మొర పెట్టుకుంటున్నా సీసీఐ సంస్థతో పాటు మార్కెటింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో దాదాపు 2.20 లక్షల హెక్టార్లలో పత్తి సాగవుతుంటే.. కేవలం ఆదోని, కోడుమూరు, నంద్యాలలో మాత్రమే పత్తి కొనుగోలు జరుపుతుండటంతో రైతులకు తీవ్ర ఇబ్బందిగా మారింది.

మరోవైపు దళారులు, వ్యాపారులు గ్రామాలకు లారీలలో తీసుకెళ్లి పత్తిని రైతుల నుంచి కొని రాత్రికిరాత్రి పక్క రాష్ట్రాల్లోని జిన్నింగ్ మిల్లులకు తరలిస్తుండటంతో మార్కెటింగ్ శాఖ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. మార్కెట్ యార్డులో సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేస్తే తమకు న్యాయం జరుగుతుందని అధికారుల పర్యవేక్షణ ఉండడం వల్ల అక్రమాలకు చోటు ఉండదని రైతులు గత ఐదు సంవత్సరాలుగా మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులకు మొర పెట్టుకుంటున్నా ఏ మాత్రం పట్టించుకున్న పాపాన పోవడం లేదు.

జిన్నింగ్ మిల్లుల్లోనే కొనుగోలు కేంద్రాలు


సీసీఐ ఖర్చులను తగ్గించుకునేందు కోసం జిన్నింగ్ మిల్లులోనే పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. ఈ విధానం వల్ల రైతులు అన్యాయానికి గురవుతున్నారు. రైతులు పత్తిని దూర ప్రాంతాల్లోని ఆదోని, ఎమ్మిగనూరు, పెంచికలపాడు కొనుగోలు చేసేందుకు రైతులు ఎన్నో వ్యయప్రయాసల కోర్చి వెనక్కి తీసుకెళ్లాల్సిన దారుణ పరిస్థితి నెలకొంది. నంద్యాల జిల్లాలో నంద్యాలలో మాత్రమే ప్రతి సంవత్సరం పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కాగితాల్లో చూపడం తప్పితే.. అక్కడ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవడం ఆ జిల్లా పత్తి రైతులు దళారులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తేనే తమకు న్యాయం జరుగుతుందని రైతులు స్పష్టం చేస్తున్నారు. సీసీఐ సంస్థ అధికారులు మాత్రం రైతుల విజ్ఞప్తిని పట్టించుకోవడం లేదు. జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే తమకు రవాణా ఖర్చులు తగ్గిపోతాయని రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తిని జిన్నింగ్ మిల్లుల్లోనే జిన్నింగ్ చేపట్టేందుకు ఏ మాత్రం ఖర్చు ఉండదని చెబుతున్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆ విధంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలే గాని, జిన్నింగ్ మిల్లులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఎలా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా వ్యాపార సంస్థ లాగా మారి తమకు తీరని నష్టాన్ని కలిగించడం దారుణం అని వారు ధ్వజమెత్తుతున్నారు.

పత్తి అమ్మకాల్లో అక్రమాలు ఎన్నెన్నో..

పత్తి కొనుగోలు కేంద్రాలను తమకు అనుకూలంగా కాకుండా మారు మూల ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకే సీసీఐ సంస్థ నిర్ణయిస్తుండటంతో రైతులు మరోదారి లేక గ్రామాల్లోనే దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీని వల్ల దళారులు, వ్యాపా రులు అనేక అక్రమాలకు పాల్పడుతున్నారు. తక్కువ తూకంతో పాటు తాము చెప్పిన ధరకే కొనుగోలు చేస్తామని, లేకపోతే మీ ఇష్టం అని రైతులకు తెగేసి చెబుతుండటంతో మరోదారి లేక రైతులు తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కోడుమూరు నియోజకవర్గంలోని పెంచికలపాడు జిన్నింగ్ మిల్లులో అనేక అక్రమాలు జరుగుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. వ్యాపారులు, దళారులు అక్కడే తిష్ట వేసి సీసీఐ నాసిరకంగా ఉందని రైతులు తెచ్చిన పత్తిని కొనుగోలు చేయకపోవడంతో మరో దారి లేక రైతులు దళారులకే విక్రయించాల్సిన పరిస్థితి ఉంది. కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం ఒక క్వింటానికి రూ.7021గా మద్దతు ధరను నిర్ణయించింది. అయితే.. సీసీఐ నిబంధనలతో 90 శాతం మంది రైతులు పత్తిని వెనక్కి తీసుకెళ్లి గ్రామాల్లోనే దళారులకు అమ్మేశారు. కేవలం క్వింటానికి రూ.5వేల నుంచి రూ.6వేలు మాత్రమే ధర దక్కిందని రైతులు కన్నీరు మున్నీరయ్యారు.

కల్తీ విత్తనాలతో నిండా మునుగుతున్నాం

రెండేళ్లుగా నాసిరకం పత్తి విత్తనాలతో రైతులు దిగుబడి తగ్గిపోయి నష్టపోయారు. 2021లో దాదాపు రూ.లక్ష హెక్టార్లలో జాదురకం విత్తనాలను వాడి దిగుబడి కేవలం 1 లేదా 2 క్వింటాళ్లు మాత్రమే ఎకరాకు పరిమితమై రైతులు పూర్తిగా నష్టపోయారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పత్తి రైతులు ధర్నాలు, నిరసనలు తెలపడంతో గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రైతుల పొలాలకు వచ్చి దిగుబడులు తగ్గడానికి నాసిరకం విత్తనాలే కారణమని నిగ్గు తేల్చారు. వారి నివేదిక ఆధారంగా రైతులకు నష్టపరిహారం రూ.20 కోట్లు చెల్లించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు తేల్చి నివేదిక కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపారు. 2021లో ఈ దారుణం జరిగితే.. ఇప్పటికి కూడా ఆ రైతులకు పరిహారం చెల్లించకపోవడం దారుణం.



కమిషనరేట్‌లోనే పెండింగ్‌లో ఉంది



2021లో ఖరీఫ్‌లో రైతులు కావేరి కంపెనీ చెందిన జాదూరకం పత్తి విత్తనాలను కొనుగోలు చేశారు. రైతులకు కేవలం ఎకరాకు 2 నుంచి 3 క్వింటాళ్ల మాత్రమే దిగుబడి లభించింది. నాసిరకం విత్తనాలు అని నంద్యాల, గుంటూరు పరిశోధన కేంద్రాల శాస్త్రవేత్తలు రైతుల పొలాలకు వెళ్లి పరిశీలించి నిర్ధారించారు. నివేదిక మేరకు రైతులకు పరిహారాన్ని దాదాపు రూ.20 కోట్లు చెల్లించాలని కావేరి సంస్థకు నోటీసులు ఇచ్చాము. కోర్టు ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ కమిషనర్ ఆ రైతులకు రాయితీని అందించాల్సిందేనని నిర్ధారించారు. వివిధ కారణాల వల్ల నష్టపరి హారం అందలేదు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పరిహారాన్ని అందజేస్తాం.

- వరలక్ష్మి, జేడీ, కర్నూలు

వచ్చేనెల నుంచి పత్తి కొనుగోలు



రైతుల నుంచి పత్తి కొనుగోలు వచ్చే నెల నుంచి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. సీసీఐ నిర్ణయించిన నిబంధనల మేరకే రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేస్తాం. ఆ సంస్థ అధికారుల నిర్ణయం మేరకే రైతులు పత్తిని అమ్ముకోవాలి. కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం క్వింటం పత్తికి రూ.7,520 మద్దతు ధరగా నిర్ణయించింది. రైతులు జిన్నింగ్ మిల్లులోని కొనుగోలు కేంద్రానికి నాణ్యమైన పత్తిని తీసుకెళ్లి మద్దతు ధరను పొందవచ్చు. పత్తి కొనుగోలు కేంద్రాలను మార్కెట్ యార్డుల్లో ఏర్పాటు చేయడం లేదు.

- నారాయణమూర్తి, ఏడీఎం

న్యూస్ బాక్స్

వలస కూలీ ఆత్మహత్య

పెద్దకడుబూరు, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక వలసకూలీ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కర్ణాటక రాష్ట్రంలో మంగళవారం జరిగింది. మండల పరిధిలోని మురవణి గ్రామానికి చెందిన ఉప్పర చిన్న రంగయ్య(40) మూడు రోజుల క్రితం భార్య, కూతురుతో కర్ణాటక రాష్ట్రానికి వలస వెళ్లాడు. మంగళవారం తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో అందుబాటులో ఆసుపత్రి లేకపోవడంతో నొప్పి భరించలేక పొలాల్లో ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రంగయ్యకు భార్య, ముగ్గురు పిల్లల సంతానం ఉన్నారు. సొంత ఊరిలోన ఉపాధి లేకపోవడంతో వ్యవసాయ కూలీలు పక్క రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. చిన్న రంగయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

పీఆర్ ఈఈ ఎం. రఘురామిరెడ్డి

కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పీఆర్ఐ, పీఐయూ డివిజన్ల పరిధిలో జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని నంద్యాల డివిజన్ పీఆర్ఐ, కర్నూలు పీఐయూ ఈఈ ఎం.రఘురామిరెడ్డి ఆదేశించారు. జడ్పీ ఆవరణలోని విశ్వేశ్వరయ్య భవన్‌లో సబ్‌డివిజన్ అధికారులతో ఏపీఆర్ఆర్‌బీ, పీఎంజీఎస్ఐ, నాబార్డు పనులపై సమీక్ష నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన వివిధ రోడ్ల నిర్మాణాల పనులపై ఆరా తీశారు. ప్రస్తుతం పనులు ఏ దశలో ఉన్నాయని డీఈలను అడిగి తెలుసుకున్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా 447 పనులు చేపట్టాలని ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఈఈ టు పీఏ పి.శిల్పాశ్రీ, డీఈఈలు రామ్మోహన్, గంగాధర్, నాగశ్రీనివాసులు, మల్లికార్జున, మన్మథబాబు, ఏఈఈలు పాల్గొన్నారు.

తంగడంచ విత్తనోత్పత్తి సంస్థపై ప్రత్యేక దృష్టి

సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు నియోజకవర్గంలోని తంగడంచ విత్తన ఉత్పత్తి క్షేత్రంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం అమరావతిలోని ఏపీఎస్ఎస్‌డీసీఎల్ కార్యాలయంలోని తన చాంబరులో సంబంధిత అధికారులతో చైర్మన్ సుబ్బారెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తంగడంచ విత్తన ఉత్పత్తి క్షేత్రానికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విత్తనాల కొరత ఉందని, వాటిని అధిగమించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రైతులు ఇబ్బందులు పడకుండా అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని తంగడంచ విత్తన ఉత్పత్తి క్షేత్రం అభివృద్ధిపై ఈ నెల 29న జరిగే బోర్డు మీటింగ్‌లో ప్రత్యేకంగా చర్చించనున్నట్లు తెలిపారు.

ర్యాంకులపై ఆందోళన వద్దు : డీఎంహెచ్‌వో



డీఎంహెచ్‌వో భాస్కర్

కర్నూలు హస్పిటల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పని చేస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఏఎన్ఎం (గ్రేడ్-3)ల ర్యాంకుల విషయంలో తలెత్తిన సందేహాలపై ఆందోళన చెందొద్దని కర్నూలు డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.భాస్కర్ సూచించారు. మంగళవారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో మాట్లాడుతూ 2019 సెప్టెంబరు 21న 2735 మంది అభ్యర్థుల మొదటి జాబితా ప్రభుత్వం నుంచి అందిందని, ఆ తర్వాత కొంత మంది కాంట్రాక్టు పద్ధతిలో పని చేసే ఏఎన్ఎంలు, ట్రైబల్, రూరల్ అర్బన్ ప్రాంతాల్లో ఉన్న వారి సర్వీసు మార్కుల ను సరి చేసి రెండో విడత జాబితాను 2742 మందితో పంపించారన్నారు. మరలా ప్రభుత్వ పరీక్ష రాసిన అందరూ అభ్యర్థులకు 15 బోనస్ మార్కులు కలిపి (30+15=45) 4431 మంది అభ్యర్థులతో కూడిన మూడో జాబితాను 2019 అక్టోబరు 30న ప్రభుత్వం పంపించిందన్నారు. 2024 అక్టోబరు 19న విడుదల చేసిన ఏఎన్ఎం గ్రేడ్-3 రివైజ్డ్ ప్రొవిజినల్ సీనియార్టీ లిస్టులో చూపించిన ర్యాంకులు ప్రభుత్వం నుంచి నియామక సమయంలో మూడోసారి అందిన 4431 మంది అభ్యర్థులతో కూడిన అర్హత జాబితాలో ఉన్నాయని తెలిపారు. రెండో, మూడో జాబితాల వల్ల ర్యాంకులు మారాయని దీన్ని ఏఎన్ఎం గుర్తించాలన్నారు. ప్రభుత్వం నుంచి అందిన అర్హుల జాబితాను గ్రేడ్-3 ఏఎన్ఎం ఉద్యోగులు సరి చూసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలను జిల్లా వెబ్‌సైట్ కర్నూలు.ఏపీ.జీవోవీ.ఇన్, నంద్యాల జిల్లా వెబ్‌సైట్ నంద్యాల.ఏపీ.జీవోవీ.ఇన్‌లో ఉంచామన్నారు.

ఉమ్మడి జిల్లాలో దాదాపు 250 వెకెన్సీలు: ఉమ్మడి జిల్లాలో సచివాలయ ఏఎన్ఎంల పదోన్నతుల ఖాళీలు దాదాపు 250 పైగా ఉన్నట్లు సమాచారం. అందులో కర్నూలు జిల్లాలో 99 ఖాళీలు ఉండగా.. మిగిలిన నంద్యాల జిల్లాకు చెందినవి. పదోన్నతుల ఖాళీల వివరాలు ఇంకా నంద్యాల జిల్లాకు సంబంధించి రావాల్సి ఉంది.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

కోడుమూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణానికి చెందిన బోయరవి హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేశామని సీఐ తబ్రేజ్ తెలిపారు. మంగళవారం స్థానిక సర్కిల్ పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ గత నెల 22న గూడూరు సమీపంలోని కల్లందొడ్డిలో బోయ రవి హత్యకు గురయ్యాడన్నారు. ఈ కేసును సమగ్రంగా విచారించి గూడూరుకు చెందిన సంజ్యబోగు అలెగ్జాండర్ హత్య చేసినట్లు గుర్తించామన్నారు. నిందితుడి కోసం గాలించి ఈ నెల 21న అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. కేసులో ప్రతిభ కనబరిచిన ఎస్ఐలు తిమ్మయ్య, మధుసూదన్‌రెడ్డి, ఏఎస్ఐ మస్తాన్, కానిస్టేబుళ్లకు రివార్డును ఇచ్చినట్లు తెలిపారు.

ఎమ్మిగనూరులో వైసీపీకి షాక్

ఎమ్మెల్యే బీవీ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు



ఎమ్మెల్యే బీవీ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు, నాయకులు

ఎమ్మిగనూరు, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో మున్సిపల్ కౌన్సిలర్లు వైసీపీకి షాకిచ్చారు. మంగళవారం వైసీపీని వీడి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. పట్టణంలోని కౌన్సిలర్లు స్వాతి (3వవార్డు), అబ్దుల్ వాహిద్ (16వ వార్డు), సరోజమ్మ(చైర్మన్ తల్లి) (25వ వార్డు), మాజీ కౌన్సిలర్ వహబ్, నాయకులు వినయ్, జాహీర్, మన్సూర్ పెద్దఎత్తున ర్యాలీగా ఎమ్మెల్యే ఇంటికి చేరుకున్నారు. వీరికి ఎమ్మెల్యే బీవీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గతంలో సైతం పట్టణంలోని వైసీపీకి చెందిన ఐదు మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరగా తాజాగా మరో ముగ్గురు కౌన్సిలర్లు చేరారు. టీడీపీలో చేరిన కౌన్సిలర్లలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు తల్లి సరోజమ్మ, ఆయన సమీప బంధువు మూడో వార్డు కౌన్సిలర్ స్వాతి ఉండటం విశేషం. మున్సిపల్ కౌన్సిల్‌లో టీడీపీ సభ్యుల సంఖ్య 10కి చేరింది. వైసీపీకి చెందిన మరి కొంతమంది కౌన్సిలర్లు కూడా టీడీపీలోకి చేరేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వెంటనే చేరనున్నట్లు తెలిసింది. ఇది ఇలాగే కొనసాగితే ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో వైసీపీ ఖాళీ అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో ఎమ్మిగనూరు పట్టణంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని గ్రహించి నేడు వైసీపీనుంచి టీడీపీలోకి చేరుతున్నారన్నారు. పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావటానికి వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలోకి రావటం అభినందనీయమన్నారు. పార్టీలోకి వచ్చిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కౌన్సిలర్లు వార్డుప్రజలకు ఇచ్చిన హామీలను తాను నెరవేరుస్తానన్నారు.రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి అజెండాగా ముందుకు పోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గట్టు అల్తాఫ్, అమాన్, వినయ్, ఇస్హాక్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టింగ్ కోసం ఎదురుచూపులు



- కేజీబీవీలో కొత్త కోర్సులు ప్రవేశపెట్టి.. ఉన్న కోర్సులును ఎత్తేశారు
- ఉద్యోగులను సర్దుబాటు చేశారు..
- మరి కొందరికి పోస్టింగ్ ఇవ్వలేదు
- ఆత్మహత్యే శరణ్యమంటున్న కాంట్రాక్ట్ టీచర్లు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగాలు గాలిలో దీపంలా మారాయి. ప్రశాంతంగా ఉద్యోగాలు చేస్తామనే నమ్మకం రోజురోజుకు సన్నగిలుతోంది. అధికారుల దయదాక్షిణ్యాల మీద ఆధారపడ్డారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పుడల్లా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేసే ఉద్యోగులు క్షణ క్షణం బతుకులు ఈడ్చాల్సిన పరిస్థితి దాపురిం చింది. జిల్లా సమగ్ర శిక్ష పరిధిలో కేజీబీవీలు, ఏపీ మోడల్ స్కూల్ వసతి గృహల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్స్ విధానంలో ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. ఆదోని కేజీబీవీ మైనార్టీ పాఠశాలలో రిటైల్ మేనేజ్ మెంట్ గ్రూపును, ఎమ్మిగనూరులో ఎంఈసీ గ్రూపులను ఎత్తివేసి, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సును ఏర్పాటు చేశారు. వీటికి సంబంధించిన సబ్జెక్ట్ టీచర్స్‌ను అవసరం ఉన్న చోటుకు సర్దుబాటు చేయాలని స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అమరావతి కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీచేశారు. ఎమ్మిగనూరులో పనిచేసే పీజీటీగా జానకమ్మను పెద్దకడబూరుకు, పి రాజేశ్వరిని హాలహర్వికి, సి.బెళగల్‌కు వేణు మాధవిని సర్దుబాటు చేశారు. అయితే ఆదోని కేజీబీవీలో పనిచేసే హేమలత, భారతికి ఎక్కడ పోస్టింగ్ ఇవ్వలేదు. వారు పోస్టింగ్ కోసం జిల్లా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

మంగళవారం నేరుగా కర్నూలు విద్యా శాఖ కార్యాలయానికి వచ్చి డీఈవో శామ్యూల్‌ను కలిసి తమను అవస రం ఉన్న చోట సర్దుబాటు చేసి ఉద్యోగంలో కొనసాగేలా చూడాలని కోరారు. జిల్లాల్లో ఖాళీ ఏర్పడ్డాక ఉద్యోగాలకు నోటిఫికేషన్ ప్రకటించారు. ఉద్యోగాల నియామక ప్రక్రియ మరో ప్రక్క కొనసాగుతుండడంతో తమ కొలువులు ఉంటాయో లేదోనన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమను కొనసాగించకపోతే తమ బతుకులు రోడ్డున పడుతాయని వాపోయారు. జిల్లా సమగ్ర శిక్షలో అసలు ఏమి జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

పోస్టింగ్ ఇవ్వాలి



ఆదోని కేజీబీవీ మైనార్టీ పాఠశాలలో రిటైల్ మేనేజ్‌మెంట్ కోర్సు ఎత్తివేసి, ఎంపీహెచ్ డబ్ల్యూవో కోర్సు ఏర్పాటు చేశారు. మమ్మల్ని అవసరమున్న చోటుకు సర్దుబాటు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు ఎక్కడ కేటాయించ లేదు. జీసీడీవోను కలిస్తే, సమాధానం ఇవ్వడం లేదు. ఎలాంటి జీవనధారం లేదు. పోస్టు ఇవ్వకపోతే ఆత్మహత్యే శరణ్యం.

- హేమలత, కేజీబీవీ కాంట్రాక్ట్ టీచర్

స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉత్తర్వులను అమలు చేయాలి



ఎస్ఎస్ఏ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉత్తర్వులను అమలు చేయాలి. ఇప్పటికే ముగ్గురిని ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేశారు. మమ్మల్ని మాత్రమే పెండింగ్‌లో పెట్టారు. కొందరిని చేసి, తమకు ఇవ్వకపోవడం దారుణం. నోటిఫికేషన్ ఖాళీలతో మా పోస్టులను భర్తీచేస్తే మా బతుకు రోడ్డున పడుతుంది.

- భారతి, కాంట్రాక్ట్ టీచర్

పైకప్పు పెచ్చులూడి విద్యార్థులకు గాయాలు



చికిత్స పొందుతున్న విద్యార్థిని

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వైపీపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం తరగతి గది పైకప్పు పెచ్చులు ఊడి ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. సీఈసీ విభాగంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు శ్వేత, చెన్నకేశవపై పెచ్చులూడి పడ్డాయి. గాయపడిన విద్యార్థులను సహచర మిత్రులు, కళాశాల సిబ్బంది ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. స్టడీ అవర్‌లో ఉన్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ మధుశేఖర్ తెలిపారు.

గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా గొర్రెలు, మేకల పెంపకందారుల సమాఖ్య అధ్యక్షుడు శ్రీనివాసులు

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గొర్రెలు, మేకల పెంపకందారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సంక్షేమమే లక్ష్యంగా చంద్రబాబు ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా గొర్రెలు, మేకల సమాఖ్య అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం జిల్లా సమాఖ్య కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం నగరంలోని పశువైద్య బహుళార్థ సాధక కార్యాలయం ప్రాంగణంలో ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, కేఈ శ్యాంబాబు, ఫెడరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, కాంగ్రెస్ పార్టీ నేత రాంపుల్లయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం గతంలో గొర్రెలు, మేకల పెంపకందారుల అభివృద్ధికి ఎన్నో చర్యలు తీసుకుందని, ఇందులో భాగంగా కేంద్ర వెనుకబడిన వర్గాల సంస్థ నుంచి నిధులను తెప్పించిందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ నిధులను సక్రమంగా మంజూరు కాకుండా ఎన్నో ఆటంకాలు సృష్టించిందని ఆరోపించారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తున్నట్లు హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం సమాఖ్య జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు డైరెక్టర్ల చేత ప్రమాణ స్వీకారం జరిపించారు. కార్యక్రమంలో జేడీ శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్లు దుర్గాప్రసన్నబాబు, ఏడీలు రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఎస్ ఆనకట్టను పరిశీలించిన ఎస్ఈ

కర్నూలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదిపై నిర్మించిన ఆర్డీఎస్ ఆనకట్టను మంగళవారం జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ బి.బాలచంద్రారెడ్డి పరిశీలించారు. తుంగభద్ర డ్యాం నుంచి నదికి 1.12 లక్షల క్యూసెక్కుల వరద నదికి విడుదల చేశారు. నదితీర గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. ఆర్డీఎస్ ఆనకట్టపై వరద ఉప్పొంగి ప్రవహిస్తోంది. గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఈఈ భాస్కర్ రెడ్డితో ఎస్ఈ బాలచంద్రారెడ్డి ఆర్డీఎస్ ఆనకట్టను పరిశీలించారు.

ఆన్‌లైన్ మోసం

కర్నూలు క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెడితే మంచి లాభాలు వస్తాయని చెప్పి రూ.44.25 లక్షలు మోసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. కర్ణాటకకు చెందిన అంబాదాస్ అనే వ్యక్తి కర్నూలు ఇంజనీర్స్ కాలనీలో స్థిరపడ్డాడు. స్టాక్ మార్కెట్ ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెడితే.. మంచి లాభాలు వస్తాయని ఓ సంస్థ చేసిన ప్రకటనను గుర్తించి ఈయన అందులో పెట్టుబడులు పెట్టాడు. రూ.44.25 లక్షలు పెట్టుబడులు పెట్టిన తర్వాత ఆ కంపెనీ నుంచి ఎలాంటి రెస్పాన్స్ రాకపోవడంతో మోసపోయానని గుర్తించి త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించాడు.

● కర్నూలు రామలింగేశ్వర్‌కు చెందిన రవికుమార్ అనే వ్యక్తి ఓ కంపెనీలో ఉద్యోగం వస్తుందని నమ్మి రూ.17.13 లక్షలు నగదు మోసపోయాడు. ఓ కంపెనీ ఇచ్చిన ఆన్‌లైన్ ప్రకటనకు అప్లయ్ చేయగా.. ఇంటర్వ్యూ చేసి పార్ట్‌టైమ్ ఉద్యోగం ఇస్తానని నమ్మించి సంస్థ ఉడాయించింది. దీంతో బాధితుడు టూటౌన్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమతంగా ఉండాలి

గూడూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ జె నయోమి అన్నారు. బుధవారం మండలంలోని కె నాగలాపురంలో సర్పంచ్ నయోమి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి సౌందర్య పారిశుధ్య పనులను ముమ్మరం చేయించారు. గ్రామంలోని మురుగు కాలువలను శుభ్రం చేయించారు.

చేతివృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): చేతివృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీసీ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కారన్న మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా 50 సంవత్సరాలు నిండిన చేతివృత్తిదారులైన నిరుపేదలకు పింఛన్ పథకాన్ని అమలు చేసి వారికి రుణాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. మాజీ కార్పొరేటర్ గిడ్డమ్మ, ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు బాబయ్య, బీసన్న, సభ్యులు రామాంజనేయులు, రైతు సంఘం జిల్లా సమితి నాయకులు సురేంద్ర యాదవ్, కృష్ణ నాయక్, రామాంజనేయులు, రాజేష్ పాల్గొన్నారు.

PUBLIC NOTICE

UNDER the instructions of my Client M/s. Shriram Finance Limited, Chennai, Branch at Kurnool, I issue the following notice to general public. My Clients intends to grant loan to **Shaik Muntaj, W/o. Shaik Sameebasha, H.No: 46-92-B, Bhudhawara Peta, Gowri Gopal Hospital, Kurnool.,** by keeping the below mentioned property of his as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges, Mortgages, Sale agreements, Court attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

కర్నూలు డి., ఓర్వకల్లు సబ్ డి., ఓర్వకల్లు మండలం, ఉసేనాపురం గ్రామ పంచాయితీకి చెందిన సర్వే నెం : 356, ప్లాటు నెంబరు : 86 : తూర్పు : ప్లాటు నెంబరు : 123 తాలూకు స్థలం, పడమర : 30 అడుగుల వెడల్పు గల రోడ్డు, ఉత్తరం : ప్లాటు నెంబరు : 87 తాలూకు స్థలం, దక్షిణం : ప్లాటు నెంబరు : 85 తాలూకు స్థలం. సర్వే నెంబరు 356, విస్తీర్ణము : 133.33 చదరపు అడుగులు.
ప్లాటు నెంబరు : 87 : తూర్పు : ప్లాటు నెంబరు : 122 తాలూకు స్థలం, పడమర : 30 అడుగుల వెడల్పు గల రోడ్డు, ఉత్తరం : ప్లాటు నెంబరు : 88 తాలూకు స్థలం, దక్షిణం : ప్లాటు నెంబరు : 86 తాలూకు స్థలం. సర్వే నెంబరు 356, విస్తీర్ణము : 133.33 చదరపు అడుగులు.
ప్లాటు నెంబరు : 88 : తూర్పు : ప్లాటు నెంబరు : 121 తాలూకు స్థలం, పడమర : 30 అడుగుల వెడల్పు గల రోడ్డు, ఉత్తరం : ప్లాటు నెంబరు : 89 తాలూకు స్థలం, దక్షిణం : ప్లాటు నెంబరు : 88 తాలూకు స్థలం. సర్వే నెంబరు 356, విస్తీర్ణము : 133.33 చదరపు అడుగులు.
ప్లాటు నెంబరు : 89 : తూర్పు : ప్లాటు నెంబరు : 120 తాలూకు స్థలం, పడమర : 30 అడుగుల వెడల్పు గల రోడ్డు, ఉత్తరం : ప్లాటు నెంబరు : 90 తాలూకు స్థలం, దక్షిణం : ప్లాటు నెంబరు : 89 తాలూకు స్థలం. సర్వే నెంబరు 356, విస్తీర్ణము : 133.33 చదరపు అడుగులు.

Byreddy Venkata Ramana Reddy
Advocate, Kurnool, Cell:94400 79646

సీసీ రోడ్లు నిర్మించాలి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని అమీర్ హైదర్‌నగర్‌లో సీసీ రోడ్లు నిర్మించాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ కోరారు. మంగళవారం నగర పాలక కార్యాలయంలో కమిషనర్ రవీంద్ర బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు శివయ్యఆచారి, నాగేంద్ర పాల్గొన్నారు.

నిరుపయోగంగా చేప పిల్లల తొట్లు

సంవత్సరాలు గడిచినా మరమ్మతులు కరువు

కర్నూలు(అగ్రికల్చర్), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని బంగారుపేటలో చేప పిల్లల పెంపకం కోసం ఏర్పాటు చేసిన తొట్లు నిరుపయోగంగా మారాయి. దాదాపు 30 తొట్లను రూ.లక్షలు ఖర్చు పెట్టి ఏర్పాటు చేశారు. ఈ తొట్లలో గతంలో రెండు లక్షల చేప పిల్లలను పెంచి వాటిని శ్రీశైలం, అవుకు, గోరుకల్లు, అలగనూరు రిజర్వాయర్లతోపాటు గాజులదిన్నె, సుంకేసుల, వెలుగోడు, సిద్దాపురం, ప్రధాన కాలువలైన హంద్రీనీవా, కేసీ కెనాల్, ఎల్లెల్సీ కాలువల్లో విడిచిపెట్టేవారు. నీటిని ఆధారంగా చేసుకుని ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 50 వేల మత్స్యకారుల కుటుంబాలు చేపల వేటను కొనసాగించి జీవనోపాధి పొందుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం చేప పిల్లల పెంపకం తొట్లను మరమ్మతులు చేయించడంలో పూర్తిగా నిర్లక్ష్యం చూపింది. దీంతో దాదాపు 15 తొట్లలో డ్రైనేజీ నీరు చేరి పాచి పట్టి చేప పిల్లల పెంపకానికి అనువుగా లేకపోయింది. వీటిని మరమ్మతులు చేయాలని మత్స్యశాఖ అధికారులు విజ్ఞప్తి చేసినా చిల్లిగవ్వ విడుదల చేయలేదు. ప్రస్తుతం ఈ తొట్లలో చేప పిల్లల పెంపకం జరగకపోవడంతోపాటు పరిసర కాలనీల ప్రజలు ఈ తొట్లలో తమ పిల్లలు ఎక్కడ ముంపునకు గురవుతారోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం శిథిలావస్థకు చేరిన చేప పిల్లల పెంపకం తొట్లను మరమ్మతులు చేస్తే వేల మంది మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి దొరుకుతుంది.



పాచి పట్టి నిరుపయోగంగా ఉన్న చేపల తొట్లు

తొట్లకు మరమ్మతులు చేయించాలి



తొట్లకు మరమ్మతులు చేయించాలి. ఒకప్పుడు కర్నూలు నుంచి చేప పిల్లలను రాయలసీమలోని అన్ని జిల్లాలకు సరఫరా చేసేవారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల కనీసం కర్నూలు జిల్లాలోని జలాశయాలకు కూడా ఇవ్వలేకపోవడం దురదృష్టకం. చేప పిల్లల పెంపకం తగ్గిపోవడం వల్ల కర్నూలు జిల్లాలోని వేలాది మంది మత్స్యకార్మికులు జీవనోపాధి కోల్పోయారు. ప్రభుత్వం నిధులను విడుదల చేస్తే తొట్లకు మరమ్మతుల చేయాలి.
-నవీన్ కుమార్, జిల్లా మత్స్య సహకార యూనియన్ జిల్లా అధ్యక్షుడు



గుర్తు తెలియని వృద్ధుడి మృతి

కర్నూలు క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ రైలులో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో రైల్వే ఎస్ఐ కిరణ్ సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి శరీరంపై నీలం, గ్రీన్, నలుపు రంగు నిలువుగీతలు కలిగిన చొక్కా, గోధుమరంగు ప్యాంటు ఉంది. మృతుడి వయస్సు 65 ఏళ్లు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. హంద్రీ ఎక్స్‌ప్రెస్‌లో టాయిలెట్‌లో మృతి చెంది ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని మార్చురికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు రైల్వే ఎస్ఐ 9440627654 నెంబరును సంప్రదించాలని సూచించారు.

ఇద్దరు వ్యక్తుల అరెస్టు

కర్నూలు అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మద్యం, నాటు సారా కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ తెలిపారు. మంగళవారం సాయంత్రం నగరం శివారులోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశామన్నారు. పసుపుల గ్రామం సమీపంలో మాణిక్యమ్మ నుంచి 75 మద్యం బాటిళ్లు, తాండ్రపాడుకు చెందిన తెలుగు లక్ష్మి నుంచి పది లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ రెహానా, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి: ఎస్పీ

కర్నూలు క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో పలు ఇంటర్మీ డియట్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులతో ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల యజమాన్యాలు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు మాట్లాడుతూ కళాశాలలు, పాఠశాలల సమీపంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యాసంస్థల వద్ద పోలీసు గస్తీ పెంచాలన్నారు. విద్యా ర్థులు అతివేగంగా బైకులు నడుపుతున్నారని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని కోరారు. ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై అవగాహన పెంచాలని సూచించారు. అనవసరమైన లింక్‌లు క్లిక్ చేయవద్దని విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అధిక శబ్దం చేస్తూ బైకులు నడిపే వారి వీడియోలు తీసి జిల్లా పోలీసు వాట్సాప్‌కు 7777877722, 91211 01100 నెంబర్లను పంపించాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్, డీసీఆర్‌బీ సీఐ గుణశేఖర్ బాబు, కమాండ్ కంట్రోల్ సీఐ శివశంకర్, స్పెషల్ బ్రాంచ్ ఏఎస్‌ఐలు, సిల్వర్ జూబ్లీ, ఉస్మానియా, కేవీఆర్, సెయింట్ జోసెఫ్, ప్రభుత్వ టౌన్, డిగ్రీ కళాశాల, నారాయణ, సాయి కృష్ణ డిగ్రీ కళాశాలలు, శ్రీచైతన్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ

సమాచార హక్కు చట్టంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

సి.బెళగల్, అక్టోబరు 22 ఆంధ్రజ్యోతి: మండల కేంద్రమైన సి.బెళగల్ రైతు భరోసా కేంద్రంలో మంగళవారం సమాచార హక్కు చట్టంపై రైతులకు మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏవో మట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలలో ఏదైనా సమచారం కావాలనుకుంటే రూ.10 పోస్టల్ స్టాంప్ ను అతికించి పోస్టు ద్వారా పంపినా లేదా స్వయంగా వచ్చిన కూడా 40 రోజులలోపు అధికారులు తగిన సమాచారం అందజేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సిద్దు, ఎంపీపీ మునెప్ప, మాజీ సర్పంచ్ చిన్న మునెప్ప, రాజు, ఎంపీవోలు పాల్గొన్నారు.

శరీన్‌నగర్‌లో కార్డెన్ సెర్చ్

కర్నూలు క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శరీన్‌నగర్‌లో మంగళవారం తెల్లవారుజామున పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో ఆరుగురు సీఐలు, ఆరుగురు ఎస్‌ఐలు, 60 మంది పోలీసులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. రౌడీషీటరుల, అనుమా నాస్పద వ్యక్తుల ఇళ్లల్లో దాడులు నిర్వహించారు. ఏడుగురు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేశారు. ఎలాంటి పత్రాలు లేని 15 బైకులను స్వాధీనం చేసుకున్నారు.

25న నగరపాలక సమావేశం

కర్నూలు, న్యూసిటీ అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు సుంకే సుల రోడ్డులోని నూతన కౌన్సిల్ హాలులో మేయర్ బీవై.రామయ్య అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు.

లా సెమిస్టర్ ఫలితాలు విడుదల చేయాలి



ఉపకులపతికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలుఅర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): లా ఐదో సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల చేయాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రప్ప డిమాండ్ చేశారు. మంగళవారం ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రప్ప మాట్లాడుతూ ఆల్ ఇండియా బార్ పరీక్షలు రాయడానికి ఈనెల 25వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఆ లోపు ఐదో సెమిస్టర్ ఫలితాలు విడుదల కాకపోతే ఎందరో విద్యార్థులు నష్టపోతారని అన్నారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల విద్యా ర్థులు గోవర్ధన్, సుమలత, అరుణ, దీప్తి పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ ఎన్నికలు

రెండు ప్యానల్ మధ్య హోరాహోరీ పోరు

కర్నూలు హస్పిటల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా యూనియన్ ఎన్నికలు బుధవారం కర్నూలు మెడికల్ కాలేజీలోని ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు జరు గుతాయని జిల్లా ఎన్నికల అధికారి బి.చెన్నమ్మ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని గవర్న మెంట్ ఆస్పత్రులు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో పని చేస్తున్న 321 మంది రెగ్యులర్ నర్సులు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఓటర్లు బ్యాలెట్‌లో అభ్యర్థులకు టిక్ మార్క్ వేయాలన్నారు. సాయంత్రం 5గంటల తర్వాత కౌంటింగ్ నిర్వహించనున్నారు. గతంలో ఎప్పుడు లేనివిధంగా శాంతి భవాని ప్యానెల్, మంజుల దేవి ప్యానెల్ హోరాహోరీగా పోటీ పడుతున్నాయి. శాంతిభవాని ప్యానల్‌కు ఏపీ ఎన్జీవో బహిరంగ మద్దతు తెలుపుతుం డగా.. మంజుల ప్యానెల్ స్వతంత్రంగా పోటీ చేస్తోంది.

'మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలి'

కర్నూలు, న్యూసిటీ అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలని ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి ఎస్.సుభాన్ పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుడు షహీద్ అష్ఫాఖుల్లా ఖాన్ 124వ జయంతిని ఆవాజ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాన్ మాట్లాడుతూ అష్ఫాఖుల్లా ఖాన్ స్వాతంత్ర్య సమరంలో కేవలం 27 సంవత్సరాలకే ఉరికంభాన్ని ఎక్కారన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పి.ఇక్బాల్ హుస్సేన్, కార్యదర్శి ఎస్ఎండీ షరీఫ్, నాసిర్ అహ్మద్, ఖాజాపాషా, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

● నగరంలోని 23వ వార్డు శ్రీరాంనగర్‌లో పెండింగ్‌లో ఉన్న రోడ్లను తక్షణమే పూర్తి చేయాలని సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ సాయిబాబా డిమాండ్ చేశారు. కాలనీలో పర్యటించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కమిషనర్ కాలనీలో పర్యటించి సమస్యను పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మయ్య పాల్గొన్నారు.

వలసలను నివారించాలి

కర్నూలు, న్యూసిటీ అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వలసలు నివారించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళ ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత కోరారు. మంగళవారం 48వ వార్డు రోజావీధిలో వలస కార్మికులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ ఆదోని డివిజన్‌లో పనులు లేక, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో వలసలు పోతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వలస కార్మికులను గుర్తించి ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. శేషమ్మ, ఆంజనేయులు, నాగప్ప, ఏసు, నాగన్న పాల్గొన్నారు.

'గృహ నిర్మాణాన్ని వేగవంతం చేయండి'

కల్లూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని కల్లూరు ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి సూచించారు. మంగళవారం కల్లూరు మండలం పెద్దటేకూరులో ఆయన పర్యటించి హౌసింగ్ లే అవుట్, గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ సెంటర్, హెల్త్ సెంటర్, రైతుభరోసా కేంద్రాలను పరిశీలించారు. అనంతరం సచివా లయంలో రికార్డులను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేయాలన్నారు. ఈవోఆర్డీ నగేష్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని న్యాయవాది శ్రీధర్ రెడ్డి అన్నారు. నగరంలోని డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఖో-ఖో, సైక్లింగ్, ఉషూ, సాఫ్ట్‌బాల్, పవర్ లిఫ్టింగ్ అండర్-14, 17 బాలబాలికలకు ఎంపిక పోటీలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా క్రీడా పోటీల్లో 1000 మంది బాలబాలికలు హాజరయ్యారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మాట్లాడుతూ జిల్లాలో క్రీడ లను ప్రోత్సాహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి గిడ్డయ్య, సహాయ కార్యదర్శి పరమేశ్, పీఈటీలు ప్రభాకర్, శంకర్‌రావు, కృష్ణ, జయగణపతి, సత్యకుమార్, లక్ష్మయ్య పద్మలత పాల్గొన్నారు.

నివేదిక సమర్పించాలి: కలెక్టర్

కర్నూలు న్యూసిటి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సమ్మర్ స్టోరేజీ ట్యాం కును స్వయంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మునగాలపాడు సమీపంలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు ఉన్న 16 పిల్లర్లలో కొన్ని పిల్లర్లు శిథిలావస్థకు చేరని మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన "ఎప్పుడైనా కూలొచ్చు" అనే కథనానికి కలెక్టర్ స్పందించి కార్పొరేషన్ అధికారులను అప్రమత్తం చేశారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

కర్నూలు, న్యూసిటీ అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు సచివా లయాల్లో ప్రారంభమైన ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు మంగళవారం తెలిపారు. ఈ నెల 25వ వరకు నగరంలోని 24 సచివాలయాల్లో ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేశామన్నారు. బయోమెట్రిక్ అప్డేట్, చిరునామా, మొబైల్ సంఖ్య వంటి తదితర వివరాలు మార్పులు చేర్పులు చేసుకోవచ్చన్నారు. పదేళ్లు దాటిన పిల్లలు తప్పనిసరిగ్గా బయోమెట్రిక్ అప్డేట్ చేసుకోవాలని సూచించారు.

తెగుళ్లపై అవగాహన కలిగి ఉండాలి

ఓర్వకల్లు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పంట తెగుళ్లపై ప్రతి రైతు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి సుధాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని తిప్పాయపల్లె, సోమయాజులపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎన్.కొంతలపాడు గ్రామంలో లక్ష్మీదేవి అనే మహిళా రైతు పొలంలో మొక్కజొన్న పంట కోత ప్రయోగం చేయగా.. 5/5 ప్రకారం చేస్తే 123 కంకులు వచ్చాయని అన్నారు. అనంతరం సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిం చారు. కార్యక్రమంలో ఏఈవో భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

సత్వరమే పనులు పూర్తి చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పీఎంశ్రీ పాఠశాలల్లో చేపట్టిన వివిధ రకాల అభివృద్ధి పనులను సత్వ రమే పూర్తి చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో విద్యాశాఖ, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. పీఎంశ్రీ కింద మొదటి, రెండు విడతల్లో 52 పాఠశాలలను గుర్తించామన్నారు. ఫేజ్-1 కింద రూ.1.24 కోట్లతో ఎనిమిది కెమిస్ట్రీ ల్యాబ్‌లు, 29 పాఠశాల్లో రూ.1.45 కోట్లతో ఆటస్థలాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఆర్డీవోలు సందీప్ కుమార్, భరత్ నాయక్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డీఈవో శామ్యూల్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ అనుమతుల్లో జాప్యం చేయొద్దు

కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ అనుమతుల్లో జాప్యం జరగకూడదని డైరెక్టర్ ఆఫ్ రాష్ట్ర టౌన్ అండ్ ప్లానింగ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ సీహెచ్ విద్యులత అన్ని నగర పాలక, మున్సిపాలిటీ, నగర పంచాయతీలకు ఉత్తర్వులు జారీ చేశారు. నగర పాలక పరిధిలో అనుమతులు కోసం వచ్చే అప్రూవల్స్‌ను కేవలం 15 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. వార్డు ప్లానింగ్ సెక్రటరీ 2 రోజులు, టౌనిప్లానింగ్ సూపర్ వైజర్ 3 రోజులు, అసిస్టెంట్ సిటిప్లానర్ 2 రోజులు, డిప్యూటీ సిటిప్లానర్ 2 రోజులు, సిటీ ప్లానర్ 3 రోజులు కమిషనర్ 3 రోజులంటే మొత్తం 15రోజుల్లో అనుమతులు మంజూరు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మురళీకృష్ణ సేవలు చిరస్మరణీయం

కర్నూలు కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం పసుపుల గ్రామ ఎంపీటీసీ సభ్యుడు మురళీకృష్ణ అందించిన సేవలు చిరస్మ రణీయమని బ్రాహ్మణ సంఘం నాయకులు కొనియాడారు. మంగళవారం రాత్రి నగరంలోని సంకల్‌బాగ్‌లోగల హరిహర క్షేత్రం ఆవరణలో మురళీకృష్ణ సంతాప సభ జరిగింది. మురళీ కృష్ణ ఫ్లెక్సీకి పూలమాలలు వేసి సంఘం నాయకులు నివాళి అర్పించారు. ఏపీ బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ నగర బ్రాహ్మణ సంఘానికి ఇటీవల జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికైన మురళీకృష్ణ అకాల మృతి సంఘానికి తీరని లోటని అన్నారు. నాయకులు టీవీ రవిచంద్ర వర్మ, నాగరాజ శర్మ, రాజశేఖర్, శ్యామసుందర శర్మ, దుర్గాప్రసాద్, ప్రసాద్, రామరాజు, ఆనంద్ పాల్గొన్నారు.

ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపు


ఆదోని టౌన్, అక్టోబరు 22, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఫుట్ పాత్‌పై బంకులు, షెడ్డులను బుధవారం పట్టణ ప్రణాళిక అధికారులు తొలగించారు. ట్రాఫిక్ సీఐ సుబ్బారావు, పోలీసుల సమక్షంలో ఏసీపీ కృష్ణ సింగ్, టీపీవో బాలమద్దయ్య ఆధ్వర్యంలో ఆక్రమణల తొలగింపు చేపట్టారు.

పేకాట స్థావరాలపై దాడులు

ఆలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అరికేర గ్రామ శివారులో పేకాట స్థావరాలపై మంగళవారం డీఎస్పీ వెంకటరామయ్య ఆదేశాల మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. పత్తికొండ డీఎస్పీ వెంకట రామయ్య విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నిర్వాహకుడు అధికార పార్టీకి చెందిన అరికేర శీనతో పాటు ప్యాపిలి మండ లానికి చెందిన బెస్త లక్ష్మీనా రాయణ, చంద్రశేఖర్, గుమ్మనూర్ బాబురావుతో పాటు మరో 8 మందిని అరెస్టు చేసి , 9 సెల్‌ఫోన్లు, రూ.1,68,750 నగదు, నాలుగు కార్లు, నాలుగు బైకులను స్వాధీనం చేసుకున్నామన్నారు. అరికెర గ్రామానికి చెందిన శీన పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఎస్ఐ వెంకట నరసింహులు సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని డీఎస్పీ వెంకటరామయ్య తెలిపారు. గ్రామాల్లో అల్లర్లు, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు..



కోలుకోలేక యువకుడి మృతి

దేవనకొండ ,అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి, చికిత్స పొందుతూ కోత్తపేట గ్రామానికి చాకలి విష్ణు (19) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు ఆర్థిక పరిస్థితి బాగోలేక, గత నెల 28న విష్ణు పురుగుల మందు తాగాడు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు కర్నూలుకి తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతు కోలుకోలేక మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పాము కాటుకు గురైన రైతు

పత్తికొండ టౌన్ అక్టోబరు 22, (ఆంధ్రజ్యోతి): పొలం పనులు చేస్తున్న రైతును మంగళవారం పాము కరిచింది. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా.. జూటూరు గ్రామానికి చెందిన రైతు వడ్డె కోసిగి నరసప్ప మిరప పంటకు నీరు కట్టేందుకు వెళ్లాడు. నీరు రాకపోవడంతో పైపులు, సరిచేస్తుండగా పాము కాటువేసింది. పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యురాలు పరీక్షించి, ప్రమాదం లేదని తెలిపారు. రైతుకు చికిత్స అందించారు.

వృద్ధాశ్రమంలో సీఐ అన్నదానం

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవనజ్యోతి వృద్ధాశమంలో టూటౌన్ సీఐ సూర్య మోహన్ రావు మంగళవారం అన్నదానం చేశారు. ఆశ్రమంలో అందుతున్న సేవలపై ఆశ్రమ నిర్వాకుడు విక్టర్ పాల్ ఫిలిప్ అడిగి తెలుసుకున్నారు. నిర్వాకులు కృతజ్ఞతలు తెలిపారు.



PUBLIC NOTICE

UNDER the instructions of my Client M/s. Shriram Finance Limited, Chennai, Branch at Adoni, I issue the following notice to general public. My Clients intends to grant loan to **B.C.Durgesh, S/o. B.C.Narasimhulu, R/o. H.No: 21/5/18, Shiva Shanker Nagar, Adoni Town & Post, Kurnool Dt,** by keeping the below mentioned property of him as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges, Mortgages, Sale agreements, Court attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

House sites, bearing Plot No's : 12,13,14 situated in Sy.No: 187-B1, in the total extent of Ac.2.16 Cents, NA LRDT No: 2675/2020, Danapuram Village Panchayath, within the limits of Adoni Sub Registration district and district registration of Kurnool, bounded as follows. **East:** 20 feet Road, **West :** Lands of Kosigi Yallappa, Kosigi Savarappa, Pilli Hanumanthu, **North:** Plot No:11, **South:** Plot No:15. **Total Measurements :** East to West 40 feet, North to South 60 feet. **Total Extent : 266.66** Sq.Yards.

C.SOMA SEKHAR
Advocate, Cell: 94900 00338.

PUBLIC NOTICE

UNDER the instructions of my Client M/s. Shriram Finance Limited, Chennai, Branch at Adoni, I issue the following notice to general public. My Clients intends to grant loan to **L.Jaya Lakshmi, W/o. L.Ganesh, R/o. H.No: 26/21/a, Kowdalpet, Adoni, Kurnool Dt.,** by keeping the below mentioned property of her as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges, Mortgages, Sale agreements, Court attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

House site, vide Plot No's : 105, situated in Sy.No: 320, 321A/4, 321B, 321C, in the total extent of Ac 4.49 Cents, Parvathapuram Village, 5th ward of Adoni Municipality, within the limits of Adoni Sub Registration district and district registration of Kurnool, bounded as follows. **East:** Plot No:106, **West :** Plot No:104, **North:** Plot No:102, **South:** Road. **Total Measurements :** East to West 30 feet or 9.14 meters, North to South 40 feet or 12.19 meters **Total Extent : 133.33** Sq.Yards.

C.SOMA SEKHAR
Advocate, Cell: 94900 00338.

PUBLIC NOTICE

UNDER the instructions of my Client M/s. Shriram Finance Limited, Chennai, Branch at Adoni, I issue the following notice to general public. My Clients intends to grant loan to **B.C.Durgesh, S/o. B.C.Narasimhulu, R/o. H.No: 21/5/18, Shiva Shanker Nagar, Adoni Town & Post, Kurnool Dt.,** by keeping the below mentioned property of his as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges, Mortgages, Sale agreements, Court attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

Plot No's: **28 & 29,** situated in Sy.No: 258-2, in the total extent of Ac.1.00 Cents, Bychigeri Village Grama Panchayath, Adoni Mdl, within the limits of Adoni Sub Registration district and district registration of Kurnool, bounded as follows.
Plot No: 28 : East: 20 feet Road, **West :** Lands of Neela Singh, **North:** Plot No:29, **South:** Plot No:27. **Measurements :** East to West 34.6 feet or 10.51 meters, North to South 19 feet or 5.80 meters. **Total Extent : 72.83** Sq.Yards.
Plot No: 29 : East: 20 feet Road, **West :** Lands of Neela Singh, **North:** Plot No:30, **South:** Plot No:28. **Measurements :** East to West 34.6 feet or 10.51 meters, North to South 19 feet or 5.80 meters. **Total Extent : 72.83** Sq.Yards.

C.SOMA SEKHAR
Advocate, Cell: 94900 00338.

పెళ్లి ఇష్టంలేక..

తుగ్గలి అక్టోబరు 22, (ఆంధ్రజ్యోతి): ఇష్టం లేని పెళ్లిని తప్పించుకోలేక ఆత్మహత్యాయత్నం చేసిన హేమలత (17) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. వివరాలు.. మండలంలోని పైచింతలకొండ గ్రామానికి చెందిన సరస్వతి, అంజనేయులు దంపతుల కుమార్తె హేమలతకు పెళ్లి నిశ్చయమైంది. అయితే తనకు ఈ పెళ్లి ఇష్టం లేదని తెలిపింది. అయినా తల్లిదండ్రులు పట్టించుకోలేదు. దీంతో ఈ నెల 18వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ప్యాపిలి, డోన్, కర్నూలు వైద్యశాలలో చికిత్స అందించారు. కర్నూలు ఆస్పత్రిలో కోలుకోలేక మంగళవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జయశేఖర్ గౌడ్ తెలిపారు.

పుల్లగుమ్మిలో ఎమ్మెల్యేలు

వెల్దుర్తి, అక్టోబరు, (ఆంధ్రజ్యోతి) 22: మండలంలోని పుల్లగుమ్మి గ్రామంలో మంగళవారం ఓ ప్రైవేటు కార్యక్రమంలో పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ.శ్యాంబాబు, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి హాజరయ్యారు.టీడీపీ నాయకుడు నాగేశ్వర్‌రెడ్డి స్వగృహంలో ఓ కార్యక్రమంలో వీరు పాల్గొన్నార.

అక్రమ కట్టడాలు కూల్చివేస్తాం

మద్దికెర అక్టోబరు 22, (ఆంధ్రజ్యోతి) : గ్రామంలోని పంచాయతీ స్థలాలను ఆక్రమంచి నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చివేస్తామని కార్యదర్శి శివకుమార్ అన్నారు. మంగళవారం కార్యాలయంలో సర్పంచ్ బండారు సుహాసిని అధ్యక్షతన పంచాయితీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. సర్పంచ్ బండారు సుహాసిని, సలహాదారులు బండారు ఆంజనేయులు మాట్లాడుతూ పంచాయితీ అభివృద్ధికి గ్రామంలోని పంచాయతీ స్థలాల్లో గదులు నిర్మిస్తున్నామనీ, వీటిని అద్దెకు ఇస్తామన్నారు. ఉచిత కొళాయి కనెక్షన్లు అందిస్తున్నామని తెలిపారు. సభ్యులు ఎన్. లక్ష్మీనారాయణ, జంబునాథ్ రాయుడు, చంద్రశేఖర్‌గౌడు, ఉపసర్పంచ్ ప్రమీలమ్మ తదితరులు ఉన్నారు.


మినీ బొలెరో బోల్తా

ఆస్పరి, అక్టోబరు 22, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలిగేర బస్‌స్టాప్ ఆదోని రోడ్డులో పత్తి లోడుతో వెళ్తున్న మినీ బోలేర మంగళవారం బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ప్రయాణికులు రైతు బసవరాజు, అతని కొడుకు పురుషోత్తంకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆదోనికి తరలించారు.



















నూతన కమిటీ ఎన్నిక

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కె.ఇస్మాయిల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా బి కేశన్న, ప్రధాన కార్యదర్శిగా కె.ఇస్మాయిల్, సహాయ కార్యదర్శిగా నాగరాజులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాములు, రంగస్వామి, సాల్మాన్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్: ఎమ్మెల్యే


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బీవీ

నందవరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ చేపట్టామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం నందవరం పంచాయతీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం జరిగింది. దాదాపు 300 మంది అర్జీలు అందజేశారు. వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం ఎలాంటి పథకాలు అందివ్వలేదని, అందుకే ప్రజలు ప్రజాదర్బార్‌కు తండోపతండాలుగా వస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేర్చుతున్నామని అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ దేశాయి మాధవరావు, సోమలగూడురు వెంకట్రామిరెడ్డి, గురురాజారావు, రైస్ మిల్ నారాయణరెడ్డి, ధర్మాపురం గోపాల్, డీవీ రాముడు, లచ్చప్ప, ఈస, రహిమాన్, జగ్గాపురం నరసింహులు, నాగలదిన్నె వహాబ్ పాల్గొన్నారు.

'సాగునీటి పథకాలను సర్వనాశనం చేసిన వైసీపీ'

ఎమ్మిగనూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో సాగునీటి పథకాలను పట్టించుకోకుండా సర్వనాశనం చేశారని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని ఆయన స్వగృహంలో ఇరిగేషన్ ఎస్‌ఈ రామచంద్రారెడ్డి, ఈఈ భాస్కర్ రెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం సాగునీటి పథకాలను పట్టించుకోక పోవటంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ నాలుగు నెలల్లో ప్రణాళికబద్ధంగా పథకాలను బాగుచేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే జీఆర్పీ 7 స్కీంలకు తాత్కాలిక మరమ్మతులకుగాను రూ. 1.26కోట్లు, ఎల్లెల్సీ కాలువ మరమ్మతులకు సంబంధించి 28పనులకు రూ. 4.35కోట్లు, గాజులదిన్నె ప్రాజెక్టుకు రూ. కోటి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో వెంటనే పనులు ప్రారంభిస్తున్నామన్నారు. తాత్కాలిక మరమ్మతులకు నిధులు మంజూరు చేసిన సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో టీడీపీ బీసీసెల్ రాష్ట్ర నాయకులు ఈరన్న గౌడ్, నారాయణ రెడ్డి, కాశీం వలి, గోపాల్, ఉరుకుందయ్య శెట్టి, బీజేపీ నాయకులు నరసింహులు పాల్గొన్నారు.

తొలిసారిగా మంత్రాలయం వచ్చిన బిషప్‌లు

ఇంటర్ రిలీజియస్ సమావేశానికి పీఠాధిపతికి పిలుపు


పీఠాధిపతిని సన్మానిస్తున్న బళ్లారి బిషప్‌లు

మంత్రాలయం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠానికి బళ్లారి బిషప్ రైట్ రెవ.హెంద్రీ డిసౌజా, రెవ.ఫాదర్ ఈవెన్ ఫింటో మంగళవారం మంత్రాలయం వచ్చారు. వీరికి మఠం అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులతో ప్రత్యేక సమావేశమై బళ్లారిలో నవంబరు నెల 27న జరిగే ఇంటర్ రిలీజియస్ సమావేశానికి ముఖ్యఅతిథిగా రావాలని పీఠాధిపతిని ఆహ్వానించారు. అనంతరం క్రిస్టియన్ బిషప్‌లకు రాఘవేంద్ర స్వామి చరిత్రను థామస్ మండ్రో చేసిన సేవలను వివరించారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు బిషప్‌లకు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు పరిమళ ప్రసాదం ఇచ్చారు. అదే విధంగా బళ్లారి బిషప్ రైట్ రెవ.హెంద్రీ డిసౌజా, ఫాదర్ ఈవెన్ ఫింటోలు పట్టువస్త్రం, శాలువ గ్రంథాలను అందజేసి సత్కరించారు.

ఉపాధి కల్పిస్తాం: ఏపీడీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోసిగి అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి పనులు కల్పిస్తామని ఆర్‌ఈజీఎస్ అధికారులు ఏపీడీ లోకేశ్వర, ఏపీవో చంద్రశేఖర్ అన్నారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వలస కోసిగి అనే శీర్షిక ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. మంగళవారం మండలంలోని 24 గ్రామ పంచాయితీలో ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. అందరికీ ఉపాధి హామీ పథకంలో పనులు కల్పిస్తామని ఎవరూ వలస వెళ్లవద్దని కూలీలకు అవగాహన కల్పించారు. కుటుంబానికి వందరోజులు పనులు కల్పిస్తామని ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు కూలీలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది సుజాత, గిడ్డయ్య, విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: గ్రామాలలో ఉపాధి పనులు కల్పిస్తామని, కూలీలు తప్పని సరిగా పనులకు హాజరుకావాలని ఎంపీడీవో మణిమంజరి కోరారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఉగాదికి వస్తాం' అన్న శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. మంగళవారం సాయంత్రం ఎస్సీ కాలనీలో ఉపాధి కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వలసలు వెళ్లితో అక్కడ జరిగే ఇబ్బందులను గురించి కూలీలకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, ఈవోఆర్‌డీ అనంతశయనా, ఎపీవో మహమ్మద్ బాషా, కార్యదర్శి సతీష్, హౌసింగ్ ఏఈ షేక్షావలి, సీనియర్ మేటి సలామ్ పాల్గొన్నారు.

భూసమస్యలను రెండు వారాల్లో పరిష్కరిస్తాం

గోనెగండ్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామ సభలలో వచ్చే భూసమస్యలను రెండు వారాల్లో పరిష్కరిస్తామని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఐరన్‌బండ గ్రామంలో భూసమస్యల పరిష్కరం కోసం ఏర్పాటు చేసిన గ్రామ సభకు సబ్ కలెక్టర్ హాజరయ్యారు. గ్రామంలోని రైతులు నుంచి 66 ఫిర్యాదు అందాయి.

ఇన్‌చార్జి సర్వేయర్‌కు నోటీసులు: ఐరన్‌బండ గ్రామంలో జరుతున్నరెవెన్యూ గ్రామ సభకు మండల ఇన్‌చార్జి సర్వేయర్ అబ్దుల్ వహాబ్ హాజరు కాకపోవడంతో సబ్ కలెక్టర్ సీరియస్ అయ్యారు. గ్రామసభకు హాజరుకు కాని కారణంగా నోటీసులు జారీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

● విద్యార్థులు చదువుకునే సమయంలో పాఠశాల ఆవరణలో గ్రామ సభ పెడతారా మండల రెవెన్యూ సిబ్బందిపై ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పొరపాటు మరోసారి జరగరాదండటూ సిబ్బందికి సూచించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పుష్ప సినిమాను తలపించే విధంగా వాహనాన్ని తయారు చేయించుకొని కర్ణాటక నుంచి మద్యాన్ని తరలిస్తుండగా, అజ్ఞాత వ్యక్తుల సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సీఐ రామాంజులు, మాధవరం ఎస్ఐ విజయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మాధవరం గ్రామానికి చెందిన బోయ రాముడు అనే వ్యక్తి తన ఓమిని వాహనంలో సీట్లను కత్తిరించి వాటి మధ్యలో 15 బాక్సుల్లో 1140 ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లను ఉంచి తరలిస్తుండగా.. రహస్యంగా వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కాపు కాశారు. గ్రామ సమీపంలోకి రాగానే వాహనాన్ని అదుపులోకి తీసుకొని తనిఖీ చేపట్టారు. సీట్ల మధ్య ఉంచిన 15బాక్సుల కర్ణాటక మద్యం, ఓమినీ వాహనాన్ని సీజ్ చేసి, రాముడుని అరెస్టు చేసినట్లు తెలిపారు.